www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్


Published From : Hyderabad - Vijaywada - Delhi - Bengaluru
బుధవారం 09, జూలై, 2025 | పేజీలు :12



మళ్లీ తెరపైకి ఫాతిమా ఒవైసీ కాలేజ్ వివాదం..! 2



స్థానిక ఎన్నికల్లో కొత్త రిజర్వేషన్లు : పీసీసీ చీఫ్ 3



ఏసీబీ వలలో స్టేట్ డిప్యూటీ టాక్స్ ఆఫీసర్ సుధా..! 4



# ముగిసిన సీఎం రేవంత్ ఢిల్లీ టూర్..!

- **పలువురు కేంద్ర మంత్రులతో రేవంత్ సమావేశం**
- **స్పోర్ట్స్ యూనివర్సిటీకి సహకరించాలని విజ్ఞప్తి**
- **యూరియాను సకాలంలో సరఫరా చేయాలని వినతి**
- **జహీరాబాద్ స్మార్ట్ సిటీ, వరంగల్ విమానాశ్రయానికి సహకారం కోరిన సీఎం**

**టీపీఎన్, ఢిల్లీ:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. ఈ పర్యటన సందర్భంగా ఆయన పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ భేటీల్లో ఆయన వివిధ అంశాలపై కేంద్ర మంత్రులతో విస్తృత చర్చలు జరిపారు. ఇందులో ముఖ్యంగా.. తెలంగాణ రాష్ట్ర అవసరాల కోసం కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జె.పి. నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని మంత్రి అధికారిక నివాసంలో రేవంత్ రెడ్డి ఆయనను కలిశారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్‌జూన్ మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయినట్లు సీఎం నడ్డా దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు అందడం, సాగు పనులు జోరుగా సాగుతుండడంతో యూరియా సరఫరాలో ఆటంకాలు రాకుండా చూడాలని కోరారు. జులై నెలకు 63 వేల మెట్రిక్ టన్నుల దేశీయ యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశీ యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయినట్లు సీఎం తెలిపారు. దేశీయంగా ఉత్పత్తి అయ్యే యూరియా కోటాను తెలంగాణకు పెంచాలని, రైల్వే శాఖ తగిన రేక్‌లను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**జహీరాబాద్ స్మార్ట్ సిటీ, వరంగల్ విమానాశ్రయానికి సహకారం కోరిన సీఎం**

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో గోయల్‌తో సీఎం భేటీ అయ్యారు. స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (NICDIT) ఆమోదించిన రూ.596.61 కోట్లను త్వరగా విడుదల చేయాలని కోరారు. నీటి సరఫరా, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే హైదరాబాద్‌వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని, హైదరాబాద్‌విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజిబిలిటీ అధ్యయనం జరుగుతున్నట్లు గోయల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆదిభట్లలో అత్యున్నత మౌలిక వసతులతో రక్షణ, ఏరోస్పేస్ పార్కును ఏర్పాటు చేసిన నేపథ్యంలో, హైదరాబాద్‌బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను ఏరోడిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కోరారు. 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పిస్తామని, కేంద్రం మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశ, మూసీ నది పునర్జీవన ప్రాజెక్ట్, ఎరువుల కొరత వంటి రాష్ట్రానికి ప్రాధాన్యమున్న అంశాలపై చర్చలు జరిగాయి. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి సాంకేతిక, ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో సీఎం ఈ సమావేశాలు నిర్వహించారు. సోమవారం ఢిల్లీ వెళ్లిన ఆయన కేంద్ర క్రీడా శాఖ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రీడా వసతుల అభివృద్ధికి రూ. 100 కోట్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. యువతలో క్రీడా శక్తిని అభివృద్ధి చేయాలని, క్రీడలతో పాటు క్రీడాకారులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



# అంబర్‌పేట బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం..!

- **బతుకమ్మ కుంట కోసం నడుం బిగించిన హైడ్రా**
- **రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు**
- **బతుకమ్మ కుంటపై రంగనాథ్ స్పెషల్ ఫోకస్**
- **సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి బతుకమ్మ కుంట**

**టీపీఎన్, హైదరాబాద్ :**

అంబర్‌పేట బతుకమ్మ కుంటకు మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. చెరువుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా (HYDRAA) ఈ చెరువు పునరుద్ధరణను తమ విజయాల ఖాతాలో వేసుకుంది. సుమారు 8 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ఈ చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. సెప్టెంబర్ నాటికి చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, ప్రజలకు మరింత చేరువ చేసేందుకు హైడ్రా శరవేగంగా పనులు జరిపింది.

హైడ్రా అధికారి రంగనాథ్ ఈ ప్రాజెక్టు బాధ్యతలు చేపట్టిన తర్వాత బతుకమ్మ కుంటపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ చెరువుకు సంబంధించి స్థానికంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా.. హైడ్రా పక్కా ఆధారాలతో కోర్టుకు నివేదించింది. 14 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ కుంట ప్రస్తుతం 5 ఎకరాలకు కుంచించుకుపోయిందని తెలిపింది. దీంతో హైకోర్టు హైడ్రాకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోర్టు ఆమోదంతో రంగనాథ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం రంగంలోకి దిగి, ఆక్రమణదారుల అక్రమ కట్టడాలను నేలమట్టం చేసి చెరువును విస్తరించింది.

అనంతరం ప్రభుత్వం 8 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది, అవసరమైతే మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొంది. మట్టి, చెత్త చెదారంతో కనుమరుగైన బతుకమ్మ కుండ ఇప్పుడు నీటితో కళకళలాడుతోంది. ఫిబ్రవరి నుంచి పనులు ప్రారంభమై, మట్టి తవ్వకాల సమయంలో అడుగు లోతులోనే నీరు దర్శనమిచ్చింది. గతంలో వాటర్ పైప్‌లైన్ పేరుతో దుష్ప్రచారం జరిగినప్పటికీ, హైడ్రా వెనుకడుగు వేయకుండా అకుంఠిత దీక్షతో పనులను కొనసాగించింది. సుమారు 90 శాతం పనులు పూర్తయ్యాయని, సెప్టెంబర్ నాటికి చెరువును పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హైడ్రా అధికారి రంగనాథ్ తెలిపారు. బోటింగ్, వాకింగ్ ప్లాట్‌ఫాం, చిల్డ్రన్స్ పార్క్ వంటి సౌకర్యాలతో చెరువును అభివృద్ధి చేశారు. బతుకమ్మ కుండకు జీవం పోసిన హైడ్రా, ఇతర చెరువుల అభివృద్ధి కోసం కూడా కృషి చేస్తోంది.




# హైదరాబాద్‌లో వరుస బాంబు బెదిరింపుల కలకలం..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

నగరంలో వరుస బాంబు బెదిరింపు మెయిల్స్ కలకలం రేపాయి. రాజ్ భవన్, సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్, సికింద్రాబాద్ సివిల్ కోర్టులో బాంబులు పెట్టినట్లు దుండగులు మెయిల్స్ పంపారు. దీంతో ఈ ప్రాంతాల్లో పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. సిటీ సివిల్ కోర్టులో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు పూర్తి చేయగా, ఈ బెదిరింపు మెయిల్ ఫేక్ అని అధికారులు గుర్తించారు.ఇటీవల దేశంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో బాంబు బెదిరింపులు వరుసగా వస్తున్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, బేగంపేట ఎయిర్‌పోర్టులలో ఇటీవల ఇలాంటి బెదిరింపులు కలకలం రేపాయి. తాజాగా, సిటీ సివిల్ కోర్టులో ఆరు ప్రదేశాల్లో బాంబులు పెట్టామని చీఫ్ జస్టిస్‌కు మెయిల్ వచ్చింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దాదాపు మూడు గంటల పాటు సిటీ సివిల్ కోర్టు పరిసరాల్లో అణువణువూ తనిఖీ చేశారు. ఆ తర్వాత ఈ మెయిల్ ఫేక్ అని పోలీసులు నిర్ధారించారు. అబీదా అబ్దులా పేరుతో ఈ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు తెలిపారు. ఎలాంటి బాంబులు లేవని, ఇది ఫేక్ మెయిల్ అని పోలీసులు పేర్కొనడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

గవర్నర్ అధికారిక నివాసం రాజ్ భవన్‌లో పోలీసులు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. జింఖానా క్లబ్, సివిల్ కోర్టులలో కూడా తనిఖీలు జరిపారు. ఈ సోదాల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు దొరకలేదని, ఇవి ఫేక్ మెయిల్స్ అని పోలీసులు స్పష్టం చేశారు. ఓల్డ్ సిటీలోని సిటీ సివిల్ కోర్టులో ఈ బాంబు బెదిరింపు గందరగోళానికి దారితీసింది.

కోర్టులో ఉన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు భయంతో బయటకు పరుగులు తీశారు. కోర్టు హాళ్లలో ఉన్నవారిని ప్రాంగణం నుంచి ఖాళీ చేయాలని కోరడంతో అన్ని కార్యకలాపాలు స్తంభించాయి. మీర్‌చౌక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెంకటేశ్వర్ రావు నేతృత్వంలో పోలీసు బృందాలు కోర్టుకు చేరుకున్నాయి. బాంబు డిస్పోజల్ స్క్వాడ్, అధునాతన గుర్తింపు పరికరాలు, స్నిఫర్ డాగ్‌లతో ప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ ఘటనతో కోర్టు కార్యకలాపాలు నిలిచిపోయాయి. సీనియర్ పోలీసు అధికారులు కోర్టు పాత, కొత్త బ్లాకులను చుట్టుముట్టారు. ఈ కోర్టు పురానీ హవేలీలోని పాత పోలీస్ కమిషనర్ కార్యాలయానికి సమీపంలో ఉంది, ఇక్కడ ప్రస్తుతం సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం ఉంది. మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపారనే విషయాన్ని తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. భయాందోళనలను వ్యాప్తి చేసిన వారిని గుర్తించేందుకు కృషి చేస్తున్నారు.

# భద్రాచలం రామాలయం ఈవో రమాదేవిపై దాడి..!

- **రాములోరి భూముల్లో అక్రమంగా నిర్మాణాలు**
- **అడ్డుకున్న ఈవోతోపాటు దేవాలయ సిబ్బందిపై దాడి**
- **గ్రామస్తుల దాడిలో సొమ్మసిల్లిన ఈవో రమాదేవి**
- **రమాదేవిని ఫోన్‌లో పరామర్శించిన మంత్రి కొండా సురేఖ**
- **దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం**

**టీపీఎన్, భద్రాచలం :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం రామాలయం కార్యనిర్వహణ అధికారి (ఈవో) రమాదేవిపై పురుషోత్తపట్నం గ్రామస్తులు దాడి చేశారు. ఈ దాడిలో రమాదేవి సొమ్మసిల్లి పడిపోగా, ఆమెతో పాటు ఆలయ సిబ్బందిపై కూడా గ్రామస్తులు ఇష్టానుసారంగా దాడులు చేశారు.

పురుషోత్తపట్నంలో రాములవారి భూములపై నూతన గృహాలు నిర్మిస్తున్నారనే సమాచారంతో ఈవో రమాదేవి తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అక్కడ జరిగిన వాగ్వివాదంలో గ్రామస్తులు ఆమెపై దాడి చేశారు. ప్రస్తుతం రమాదేవిని కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సుమారు 500 మంది గ్రామస్తులు, 30 మంది ఆలయ సిబ్బంది మరియు



ఈవోపై దాడి చేసినట్లు తెలుస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా ఎడపాక మండలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి చెందిన 1200 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూములను పురుషోత్తపట్నం గ్రామస్తులు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. అయితే, ఇప్పుడు ఈ భూములు తమవేనని వాదిస్తూ గ్రామస్తులు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. దీనిని అడ్డుకోవడానికి వెళ్లిన ఈవో రమాదేవిపై దాడి జరిగింది. ఈ 1200 ఎకరాల భూములు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలం మండలం, ఖమ్మం జిల్లాలో ఉండేవి. రాష్ట్ర విభజన తర్వాత ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా ఎడపాక మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలోకి వచ్చాయి. గత 40 సంవత్సరాలుగా ఈ భూములను గ్రామస్తులు కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నారు. అయితే, రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ, వైఎస్ఆర్సీపీ ప్రభుత్వాలు ఈ భూములను పట్టించుకోకపోవడంతో, గ్రామస్తులు ఈ భూములు తమవేనని వాదిస్తూ ఇళ్లు కట్టడం, పొలాలు దున్నడం చేస్తున్నారు.



ఆన్‌లైన్‌లో సర్వే నంబర్లను తనిఖీ చేస్తే ఈ భూములు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందినవని డాక్యుమెంట్లు స్పష్టం చేస్తున్నాయి. అయినప్పటికీ, గ్రామస్తులు ఈ భూములను తమ సొంతమని వాదిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈవో రమాదేవి ఈ భూములను ఆలయానికి తిరిగి సమర్పించేందుకు పట్టుదలతో పనిచేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి దాడులు జరిగినప్పటికీ, సరైన సహకారం లేక ఆమె ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ఘటనలో 1200 ఎకరాల భూమిలో 900 ఎకరాలు సాగులో ఉండగా, 300 ఎకరాలను గ్రామస్తులు గ్రామంతో కలిపి, పేరడల రూపంలో నిర్మాణాలు చేస్తున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ భూములను ఆలయానికి తిరిగి ఇవ్వాలని తీర్పు ఇచ్చినప్పటికీ, గ్రామస్తులు ఈ భూములను తమ సొంతమని వాదిస్తూ ఆలయ ఆస్తులను కాలనీలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు.

తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ ఘటనపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై కఠిన శిక్షలు అమలు చేయాలని, లేకపోతే వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. సొమ్మసిల్లి పడిపోయిన ఈవో రమాదేవికి సరైన వైద్యం అందేలా చూడాలని భద్రాచలం ఎమ్మెల్యేకు ఆదేశించారు.



**ఈవోపై దాడిని ఖండిస్తున్నాం..**

"పురుషోత్తమ పట్టణంలో దేవస్థానానికి సంబంధించిన భూ వివాదంలో ఈవో గారు మరియు సిబ్బంది అక్కడికి వెళ్లడం జరిగింది. అక్కడ పరిస్థితులు ఈరోజు వీడియో రూపంలో గానీ ఫోటో రూపంలో గానీ చూడం చాలా బాధాకరం. ఇలాంటి సంఘటనలు అనేకసార్లు జరిగిన కూడా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్య తీసుకుని ఇంకొకసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలి."

**-దన్నాన తరుణ్ కుమార్**
**హైకోర్టు న్యాయవాది**



# దేశంలో ప్రజల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ : భట్టి విక్రమార్క

- నిన్న రైతు భరోసా..!
- 12 నుంచి మహిళలకు వడ్డీ లేని రుణాలు
- ఆ తర్వాత రాజీవ్ వికాసం

**టీపీఎన్, కేసముద్రం :**

నిన్న రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం, ఈనెల 12 నుంచి డ్వాక్రా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ లేని రుణాల పంపిణీ ఒక ఉత్సవంలా నిర్వహిస్తాం, ఆ తర్వాత నిరుద్యోగ యువత కోసం 8 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం ఉత్సవంలా చేపడుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఏర్పాటు చేసిన భారీ సభలో ప్రసంగించారు. ఈ దేశంలో అందరి గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, చేయి గుర్తును, ప్రజా ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకుని కాపాడాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం క్షేమంగా సంతోషంగా ఉండాలన్న ఆకాంక్షతో లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో లెక్క లేనన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యావత్ క్యాబినెట్ 18 గంటల పాటు రాష్ట్ర సంక్షేమం కోసం విరామం లేకుండా పనిచేస్తున్నారని వివరించారు. రూపాయి రూపాయి పోగుచేసి ప్రజల సంక్షేమం కోసం ఖర్చు పెడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 1.12 కోట్ల కుటుంబాలు ఉండగా 90 లక్షల పైగా కుటుంబాలకు ఏదో ఒక సంక్షేమ కార్యక్రమం అందుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ దేశంలోనే తెలంగాణ మోడల్ గా ఉండాలని, దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు చూసి వెళ్లేలా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు.

పంటలు పండించే రైతులకు రైతు భరోసా, బ్యాంకుల్లో రుణాలు తెచ్చుకుని సాగు చేస్తున్న రైతులకు రైతు రుణమాఫీ, పిల్లలు చదువుకునేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలు ఇంకా బాగా చదువుకుంటాం అనుకునే వారి కోసం ఫీజు రియంబర్స్మెంట్ పథకం, ఇంట్లో పెద్దలు ఉంటే చేయూత పథకం కింద పెన్షన్, ఇంటిల్లిపాది తినేందుకు సన్న బియ్యం, వంట చేసుకోవడానికి 500 రూపాయలకే గ్యాస్, ఆరోగ్యం బాగా లేకపోతే 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం, పనిచేసే శక్తి ఉంటే ఉపాధి హామీ పథకం కింద పని, చదువుకొని ప్రతిభ ఉంటే పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి 56వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసాం, ప్రభుత్వ ఉద్యోగాలు దక్కని వారికోసం రాజీవ్ యువ వికాసం పేరిట 8000 కోట్లతో స్వయం ఉపాధి పథకం, మహిళలు ప్రయాణించేందుకు ఉచితంగా ఆర్టీసీ బస్సు రవాణా సౌకర్యం, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వడ్డీ లేని రుణాలు ఇలా పుట్టిన బిడ్డనుంచి వృద్ధుడి వరకు ఏదో ఒక పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్రంలోని ఏ ఒక్కరిని వదలకుండా ప్రజా ప్రభుత్వం గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుందని వివరించారు.



# ఎల్లూరు పంప్‌హౌస్ నుంచి నీరు విడుదల..!

**టీపీఎన్, ఎల్లూరు :**

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లాలో ఎల్లూరు గ్రామంలోని రేగుమాన్ గడ్డ వద్ద మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన ఎల్లూరు పంప్ హౌస్ లో మోటర్‌ను స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఎంజీఎల్ఐ ప్రాజెక్ట్ లో భాగంగా ప్యాకేజీ 28, 29 & 30 క్రింద ఉన్న ఎల్లూరు, సింగోటం, జొన్నల బొగుడ, గుడిపల్లి గట్టు జలాశయాలను నింపి ఆయకట్టు అవసరాలకు అనుగుణంగా సాగునీటిని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి కూడా ప్రాజెక్ట్ లను పూర్తి చేయలేకపోయిందని అన్నారు. పాలమూరు రంగారెడ్డి, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఏ ప్రాజెక్ట్ లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాగితాలపై జిల్లా ఆయకట్టును 4.60 లక్షల ఎకరాలకు పెంచారు తప్ప నీటి విడుదలకు అవసరమైన పనులు చేపట్టలేదని తెలిపారు. కాలువల్లోనీటి ప్రవాహ సామర్థ్యం పెంచలేదని, మోటర్లు ఏర్పాటు చేయలేదని, 5 మోటర్లలో 2 మోటర్లు కాలిపోయిన పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఈ జిల్లా ప్రాజెక్ట్ లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అప్పటి సీయం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావును ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పుడు సాగునీటి ప్రాజెక్ట్ లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతల అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని వెల్లడించారు. పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరందస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, డా.రాజేష్ రెడ్డి, మెఘారెడ్డి, సీఈ విజయభాస్కర్ రెడ్డి, ఎస్ఇ సత్యనారాయణ రెడ్డి, ఈఈలు శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు, చంద్రవేఖర్, మరళీ, పాల్గొన్నారు.

# మళ్లీ తెరపైకి ఫాతిమా ఒవైసీ కాలేజ్ వివాదం..!


- ఎఫ్టీఎల్‌లో నిర్మాణం అంటూ తేల్చి చెప్పిన హైడ్రా
- అప్పుడు హడావిడి.. ఇప్పుడు మౌనం ఎందుకంటూ ప్రశ్న
- దమ్ముంటే కూల్చమంటూ డిమాండ్ చేసిన బీజేపీ అధ్యక్షుడు
- లోపాయికారి ఒప్పందం అంటూ ప్రచారం

**కృష్ణకుమార్, టీపీఎన్, హైదరాబాద్ :**

మళ్లీ ఫాతిమా ఒవైసీ కాలేజ్ వివాదం తెరపైకి వచ్చింది. చెరువులో నిర్మించిన ఈ కాలేజ్ విషయంలో హైడ్రా ఎందుకు మౌనంగా ఉందంటూ ప్రచారం సాగుతోంది. గతంలో హడావిడి చేసిన రంగనాథ్ వారితో లోపాయికారి ఒప్పందం చేసుకున్నాడా అని బిజేపి ఆరోపణలు చేస్తోంది. ప్రభుత్వంతో చేతులు కలపడంతోనే ఫాతిమా కాలేజ్ వదిలేశారా.. జనాలకు రూల్ ఒకలా.. ఫాతిమా కాలేజ్ కి ఒకలా చట్టాలు రూపొందించారా అంటూ బిజేపి నూతన అధ్యక్షుడు రాంచదర్ రావు ప్రశ్నిస్తున్నారు. హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే చెరువులో నిర్మాణం జరిగిన ఫాతిమా కాలేజ్ పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో మరోసారి కాలేజ్ వివాదం మొదలైంది. పాతబస్తీ బండ్లగూడ ప్రాంతంలో ఉన్నసలకం చెరువు దాదాపు 0.37 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కాగా 70శాతం కబ్జాలకు గురైంది. అంటే 0.111 చదరపు కిలోమీటర్లకు కుదించుకుపోయింది. సుమారు 0. 258 చదరపు కిలోమీటర్ల ప్రాంతం కబ్జాకు గురైంది. ఇందులో బహుళ అంతస్తు భవనాలతో పాటు అక్బరీద్దీన్ ఒవైసీ బ్రదర్స్ 2017లో 12 భవనాలు




నిర్మించారు. అందులో ఫాతిమా ఒవైసీ కాలేజ్ నడిపిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన తరువాత చెరువుల పరిరక్షణ కోసం హైడ్రాను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా చెరువుల ఆక్రమిత ప్రాంతాలను పరిశీలించి వాటిని నేలమట్టం చేయడం మొదలు పెట్టారు. అందులో భాగంగా ఎన్ కన్వెన్షన్ సెంటర్ తో పాటు అనేక బహుళ అంతస్తు భవనాలు నేలమట్టం చేశారు. ఇక్కడి వరకు అంతా సవ్యంగానే సాగింది. ఆ తరువాత హైడ్రా రికార్డుల ప్రకారం సలకం చెరువులో ఒవైసీ బ్రదర్స్ చేపట్టిన మెడికల్ కాలేజ్ ఎఫ్ టిఎల్ పరిధిలో ఉందని తేల్చింది. 1979 నుండి 2023 వరకు శాటిలైట్ ద్వారా వివారాలు హైడ్రా సేకరించింది. దీన్ని సైతం నేలమట్టం చేయాలని సంకల్పించింది. అప్పట్లో ఫాతిమా కాలేజ్ నెక్స్ హైడ్రా టార్గెట్ అంటూ పెద్ద దుమారం రేగింది. దీనిపై చాంద్రాయణగుట్ట ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసి అసెంబ్లీ వేదికగా నానా రభస చేశాడు. కాలేజ్ జోలికి వస్తే సహించేది లేదని, దాన్ని అడ్డుకుంటామని, అవసరమైతే సిటీని రణరంగంగా మార్చుతామని హెచ్చరించాడు. ఈ కాలేజ్ లో ప్రతి ఏడాది 10వేల మందికి పైగానే తాము పేద విద్యార్థులకు కేజీ టు పిజీ వరకు ఉచితంగా విద్యా అందిస్తున్నామని, కూల్చివేత చేస్తే విద్యార్థులంతా రోడ్డున పడతారని అన్నారు.




దీన్ని తాము ఎట్టిపరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు.

**లోపాయికారి ఒప్పందం జరిగిందా?**

అప్పటి వరకు నానా హడావిడి చేసిన హైడ్రా ఒక్కసారిగా ఆ కాలేజ్ విషయంలో వెనక్కి అడుగు వేసిందని ప్రచారం మొదలైంది. హైడ్రా ఏర్పాటు జరిగి జూలై 18కి ఏడాది పూర్తవుతుంది. మరి అన్ని చెరువులపై పడ్డ హైడ్రా సలకం చెరువు విషయం ఎందుకు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం జరిగిందా.. కాంగ్రెస్, ఎంఐఎం భాయ్ భాయ్ అనే సరికి దాన్ని వదిలేశారంటూ ప్రతి పక్షాలు, జనాలు దుమ్మెత్తిపోస్తున్నారు. అప్పోసొప్పో చేసి తెలిసీ తెలియక ఇండ్లు కొనుగోలు చేసిన వారిని రోడ్డున పడేయడం, మూసీ ప్రక్షాళన అంటూ దాని పరివాహాక ప్రాంత వాసులను వీధిలోకి విసిరేసే హైడ్రా ఫాతిమా ఒవైసీ కాలేజ్ పై



ఎందుకు సవతి ప్రేమ చూపిస్తోందని బిజేపి నూతన రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే నేలమట్టం చేసి చెరువుకి మోక్షం కలిగించాలని అన్నారు. లేదంటే లోపాయికారి ఒప్పందాలు రంగనాథ్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

**ఈ ఒప్పందంలో నిజమెంత?**

ఇదిలావుంటే ఫాతిమా కాలేజ్ కి బదువులు సంతోష్ నగర్ చౌరస్తాలో ఉన్న ఒవైసీ ఆసుపత్రి స్థలం మెట్రో నిర్మాణం కోసం ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, అందుకు బదులు ఆ కాలేజ్ జోలికి వెళ్లడం లేదని విషయం కూడా ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా ఈ విషయంపై అక్బరీద్దీన్ కోర్టు నుండి స్టే తెచ్చాడంటూ ఆయన సన్నిహితులు చెప్పుకొస్తున్నారు. ఏది ఏమైనా అందరూ మర్చిపోయారని భావిస్తున్నా హైడ్రాకు మరోసారి ఫాతిమా కాలేజ్ వ్యవహారం రచ్చకావడం మింగుడు పడని వ్యవహారంలా మారిపోయింది. బడుగు, బలహీన వర్గాలు, పేద, మధ్య తరగతి కుటుంబాలను గృహప్రవేశం రోజునే రోడ్డున పడేసేందుకు హైడ్రా ఏర్పాటు జరిగిందా అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. మరీ వారందరీ ప్రశ్నలకు ఫాతిమా కాలేజ్ వివాదానికి హైడ్రా బాస్ రంగనాథ్ ఎలా సమాధనం చెబుతారో చూడాలి మరి.

# కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : ఈటల రాజేందర్

**టీపీఎన్, హైదరాబాద్ :**

కంటోన్మెంట్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. 2024లో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అవసరమైన రక్షణ శాఖ భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించారని చెప్పారు. ఈ భూమికి బదులుగా వచ్చిన 303 కోట్ల రూపాయలను రక్షణ శాఖ కన్సాలిడేటెడ్ ఫండ్‌లో జమ చేయాలని అప్పట్లో నిర్ణయించారని తెలిపారు.

అయితే, "కంటోన్మెంట్ బోర్డు ఈ నిధులను తమ ఖాతాలోనే జమ చేయాలని తీర్మానించి, ఈ మేరకు లేఖ రాసింది. ఎంపీగా నేను, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు కూడా ఈ విషయంపై లేఖలు రాశాము. పార్లమెంట్‌లో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించాను. శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు డబుల్ డెక్కర్ బ్రిడ్జి నిర్మించి, మెట్రో మరియు రోడ్డు సౌకర్యాలు ఉండేలా చూడాలని కోరాను.

కంటోన్మెంట్ బోర్డు తీర్మానం, నా లేఖలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారి సహకారంతో కేంద్ర




రక్షణ శాఖ ఈ రోజు 303 కోట్ల రూపాయలను బోర్డు ఖాతాలో జమ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా, 11 కోట్ల రూపాయల గ్రాంట్‌ను కూడా కేటాయించింది. ఈ నిధులతో పాటు, 160 కోట్ల రూపాయలతో రెండు స్టార్మ్ వాటర్ డ్రైన్‌ల నిర్మాణం చేపడతాము. ఒకటి జూబ్లీ నుంచి ప్యాట్నీ వరకు, మరొకటి రసూల్‌పూర బస్తీల మీదుగా నిర్మించబడుతుంది. ఈ డ్రైన్‌లు SNDP ప్రమాణాల ప్రకారం నిర్మితమవుతాయి. దీనితో కంటోన్మెంట్, బోయినపల్లి ప్రాంతాలకు వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అలాగే, 128 కోట్ల రూపాయలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్‌ను కూడా అభివృద్ధి చేయనున్నాము.

కంటోన్మెంట్‌కు కేంద్రం ఏమీ చేయలేదనేవారికి ఇదే మా సమాధానం. కంటోన్మెంట్‌లో పార్కులు, రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, వరద కాలువల నిర్మాణం చేపడతాము. కంటోన్మెంట్ ఒక సుందరమైన ప్రాంతం. ఇక్కడ వాతావరణం సగటున రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఇక్కడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాము. సాధారణంగా, రక్షణ శాఖ భూములు బదలాయిస్తే, ఆ నిధులు కేంద్ర రక్షణ శాఖ ఖాతాలో జమవుతాయి. కానీ, తొలిసారిగా ఈ నిధులను కంటోన్మెంట్ బోర్డుకు కేటాయించినందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారికి, పూర్తి సహకారం అందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. కంటోన్మెంట్ పాలక మండలి కావాలని మేము కోరుకుంటున్నాము. త్వరలో బోర్డు ఎన్నికలు జరుగుతాయని ఆశిస్తున్నాము. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తాం" అని ఈటల చెప్పారు.

# ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పొన్నం

**టీపీఎన్, హైదరాబాద్ :**

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ కొమురం భీం భవన్ లో జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బందికి ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లో మంత్రి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య పరీక్షలు చేసే క్యాంప్‌లో అధునాతన యంత్రాలు, సిబ్బందికి ఇచ్చే మందులు తదితర వాటిని మంత్రి పరిశీలించారు. అనంతరం జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి వ్యక్తిగత పరికరాల కిట్స్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వీ.కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... హైదరాబాద్ మహానగరాన్ని జిహెచ్ఎంసి వర్కర్లు పరిశుభ్రంగా ఉంచుతున్నారని అన్నారు. జీహెచ్ఎంసీ లో పని చేస్తున్న ప్రతి శానిటేషన్ సిబ్బంది కి ఆరోగ్య పరీక్షలు చేస్తూ నెల వారి మందులు ఇచ్చే కార్యక్రమం ప్రారంభమైందని అన్నారు. మీ ఆరోగ్యాన్ని కాపాడడానికి తీసుకున్న నిర్ణయం లో భాగంగా మీ అందరి జీతాలు పెంచాలనే ఆలోచన ప్రభుత్వంలో ఉందన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు పోతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న మీ పట్ల సానుకూలంగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు రానున్నట్లు మంత్రి తెలిపారు. అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, హైదరాబాద్ లో స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కొన్ని స్లమ్స్ డెవలప్ చేస్తూ అక్కడ నిర్మాణాలు చేపట్టి మీకు ఇవ్వాలని ప్రణాళికలు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కి పెట్టుబడులు వస్తున్నాయంటే పారిశుధ్య కార్మికులు అద్దం లెక్క హైదరాబాద్ ను ప్రపంచానికి చూపెడుతున్నారన్నారు. మీ పిల్లలు చదువుకోవడానికి గురుకులాల్లో మెస్ చార్జీలు పెంచామని, రాష్ట్రంలో అర్హులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మీ పిల్లలకు చదువులు ఇబ్బంది ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గురుకులాల్లో సీట్లు ఇచ్చి చదివించే బాధ్యత మాది అని పారిశుధ్య కార్మికులకు మంత్రి హామీ ఇచ్చారు.

**ఆరోగ్యం రక్షించడానికి జీహెచ్ఎంసీ మీకు కిట్స్ అందిస్తుంది : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... శానిటేషన్ సిబ్బంది తరచుగా ఆరోగ్య సమస్యలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వం అందజేసిన కిట్స్ ను తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా ముందునుండే జాగ్రత్తలు పాటించాలని క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్మికుల ఆరోగ్యం విషయంలో జిహెచ్ఎంసి ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణ తో పాటుగా కార్మికులు అకాల మరణం పొందిన వృద్యప్య దృష్ట్యా పని చేయలేక పోయిన వారి కుటుంబ సభ్యులకి తిరిగి ఉపాధి కల్పించేదుకు జి హెచ్ ఎం సి నిర్ణయం తీసుకున్నట్లు మేయర్ పేర్కొన్నారు.



నగర వ్యాప్తి పెరిగినందున కార్మికుక సంఖ్య ను పెంచేందుకు చర్యలు తీసుకున్నట్టు మేయర్ తెలిపారు. జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ... శానిటేషన్ కార్మికులతో పాటుగా వెటర్నరీ, ఎంటమాలోజి విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు కూడా తెలంగాణా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పంపిణీ చేసినట్టు కమీషనర్ పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో శానిటేషన్ సిబ్బంది నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ తమ ఆరోగ్యం కాపాడుకోవాలని, అందుకుగాను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిహెచ్ఎంసి పరిధిలో మొదటిసారిగా బంజారాహిల్స్ పరిధిలోని 450 మంది శానిటేషన్ సిబ్బంది జిహెచ్ఎంసి ఫ్రంట్ లైన్ వర్కర్లు భావించి వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఖర్చు కు వెనుకాడకుండా ఆరోగ్య రక్షణ కు ప్రాధాన్యత ఇచినాట్కి చేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.ప్రభుత్వం అందజేసిన కిట్స్ లను తప్పక సవినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే జిహెచ్ఎంసి పరిధిలో ఎక్కువగా సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య స్టాల్స్ లలో కంటి, పంటి, ఆర్థో, టి. బి, లేప్రసి, బి.పి, షుగర్, గైనిక్, బెస్ట్ క్యాన్సర్ వంటి టెస్టులు శానిటేషన్ వర్కర్లకు వైద్యులు చేపట్టి వైద్య సేవలను అందించినట్లు జిల్లా కలెక్టర్ హరి చాందస పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, టీబీ నివారణ అధికారి చల్లా దేవి, అదనపు డి ఎం అండ్ హెచ్ ఓ లు డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ మురళీధర్, లెప్రసీ అధికారి డాక్టర్ రాధా కిషన్, తహసీల్దార్ అనిత రెడ్డి, జిహెచ్ఎంసి, అధికారులు , సిబ్బంది ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై మంత్రి పొన్నం ఫోకస్

**టీపీఎన్, హైదరాబాద్ :**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత అభివృద్ధి సంస్థాగత నిర్మాణంపై పీసీసీ ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జిగా ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించారు. జిల్లా ముఖ్య నేతలు, పీసీసీ నియమించిన పార్లమెంట్ ఇంచార్జి లు, జిల్లా పార్టీ అబ్జర్వర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 15 లోపు గ్రామ ,మండల, జిల్లా నూతన కార్యవర్గాలను పూర్తి చేసేలా కసరత్తు నిర్వహించారు. ఇప్పటికే గ్రామ, మండల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గానికి సంబంధించి గతంలో అప్లికేషన్ లు తీసుకున్న ఆశావహుల జాబితా పై స్థానిక ఎమ్మెల్యేలు ,పార్టీ ముఖ్య నేతలు, జిల్లా అబ్జర్వర్ల సమక్షంలో వారికి పీసీసీ జిల్లా ఇంచార్జి ఇంటర్వ్యూ లు నిర్వహించి తుది జాబితా ఫైనల్ చేయనున్నారు. ఒక్కో మండలానికి ముగ్గురు పేర్లు అదే విధంగా జిల్లా ఉపాధ్యక్షులు పేరు ఇతర కార్యవర్గ పేర్లు ప్రకటించనున్నారు. ఏఐసిసి ఆదేశాల మేరకు జిల్లా నూతన కార్యవర్గంలో యువత కు ప్రాధాన్యత ఇవ్వడంతో మహిళలకు పెద్ద పీట వేయాలని సూచించారు. సామాజిక సమీకరణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు నూతన కార్యవర్గంలో అవకాశం కల్పించాలని సూచించారు.పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న మూడు డీసీసీల పరిధిలో మెదక్ , సంగారెడ్డి ,సిద్ది పేట జిల్లాలో ఈనెల 11 తర్వాత పర్యటిస్తానని పీసీసీ జిల్లా ఇంచార్జి పొన్నం ప్రభాకర్ తెలిపారు... బుధవారం మెదక్ జిల్లా ముఖ్య నేతలు, 10 నియోజకవర్గాల ఇంచార్జిలు , అబ్జర్వర్లతో మరోసారి సమావేశం కానున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ , సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి, ఆంజనేయులు గౌడ్,పార్టీ అబ్జర్వర్లు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ,మెట్టు సాయికుమార్, చనగాని దయాకర్, మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్‌లు, పీసీసీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాయిద్ అలంఖాన్, బండి రమేష్, జనరల్ సెక్రెటరీలు జగదీశ్వర్ గౌడ్, దార సింగ్, ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

# రాబోయే స్థానిక ఎన్నికల కోసమే బీఆర్ఎస్ రంకెలు : పొంగులేటి



టీపీఎన్, మహబూబాబాద్ / హైదరాబాద్ : రాబోయే స్థానిక ఎన్నికలలో లబ్దిపొందేందుకు బీఆర్ఎస్ నాయకులు రంకెలు వేస్తున్నారని, వారికి మరోసారి తెలంగాణ ప్రజానీకం కర్రుకాల్చి వాతపెట్టాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో రైతు సమస్యలపై కేటీఆర్ మొసలి కన్నీరు కార్చి సిఎం రేవంత్‌ను దుర్భాషలాడారని అటువంటి వ్యక్తులకు ఈ సభ సరైన సమాధానమని అన్నారు. మహబూబాబాద్ మండలం సోమాల తండాలో మంగళవారం ప్రజాపాలన ప్రగతిబాట పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, ఎంపీ బలరాం నాయిక్ ఎమ్మెల్యేలు మురళీనాయిక్,కనకయ్య, నాగరాజు, విప్ రామచంద్ర నాయిక్, ప్రభుత్వ సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొని సుమారు 100 కోట్ల రూపాయిల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్దదారులకు అందజేశారు.

ఈ సందర్బంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గడచిన 18 నెలల ఇందిరమ్మ రాజ్య పాలనలో పేదవాడికి కష్టం కలగకుండా పథకాలు అందించామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతుబంధు, సన్నబియ్యం , ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇలా ఎన్నో పథకాలను ప్రజలకు అందించామన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో రైతులకు 17వేల కోట్లు రుణమాఫీ చేస్తే తాము పది నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయిలు రుణమాఫీ చేసామని గుర్తుచేశారు. 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుభరోసా అందించామని వివరించారు. ఈ నియోజకవర్గానికి 4వేలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. పేదలే లక్ష్యంగా తాము పథకాలు అమలు చేస్తుంటే బిఆర్ఎస్ నాయకులు పొట్లగిత్తల్లా రోడ్లపై పడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారిని ఇష్టానురీతిలో మాట్లాడుతున్నారని, ఈ రోజు హైదరాబాద్‌లో కేటీఆర్ రంకెలకు ఈ ప్రగతిపాలన సభే సమాధానమని అన్నారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని గాదె కింద పందికొక్కుల్లా తెగతిని బలిసిన ఆ నాయకులకు ఇప్పటికే రెండు సార్లు ప్రజలు బుద్ధి చెప్పారని, ఆ రెండు ఎన్నికల్లో గుండు కొట్టారని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లోకూడా మరోసారి బి ఆర్ ఎస్‌కు అలాగే బుద్ధిచెప్పాలని, ఇందిరమ్మ పార్టీ అభ్యర్దులను గెలిపించాలని కోరారు. మీరు చేసే అరాచకాలకు మరిన్ని ప్రతిఫలాలను అనుభవిస్తారని మంత్రి పొంగులేటి బిఆర్ఎస్ నేతలకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి జయంతి సందర్బంగా వేదికపైనుంచి పొంగులేటి నివాళులు అర్పించారు.

## గౌడ్స్ ఆందోళనకు ఎంపీ ఈటల రాజేందర్ మద్దతు..!

**టీపీఎన్, ఘట్‌కేసర్ :**



బెల్ట్ షాపుల రాకతో కల్లుగీత కార్మికుల జీవనాధారం నాశనమైందని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. కొర్రెములలో తాటిచెట్లు నరికివేయడంతో ఆందోళన చేస్తున్న గౌడ్ సమాజానికి మద్దతుగా ఎంపీ ఈటల రాజేందర్ ధర్నాలో పాల్గొన్నారు. "రియల్ ఎస్టేట్ విస్తరణ కారణంగా తాటిచెట్లు నరికివేయబడుతుండటంతో మరింత నష్టం జరుగుతోంది. "భూమి నీది కావచ్చు, కానీ చెట్టు మాది," అని గౌడ్స్ నినాదిస్తున్నారు. ప్రభుత్వం వాల్టా చట్టాన్ని అమలు చేసింది, దీని ప్రకారం ఏ చెట్టునైనా నరికే ముందు అనుమతి తప్పనిసరి. అన్నం పెట్టే తాటిచెట్టును నరికివేయడం కేవలం చెట్టును తొలగించడం మాత్రమే కాదు, అది జీవనాధారానికి సంబంధించిన విషయమని మర్చిపోవద్దని" ఈటల రాజేందర్ అన్నారు.కలెక్టర్‌తో మాట్లాడి, ఎన్ని చెట్లు నరికారో అన్ని చెట్లను పక్కనే ఉన్న భూమిలో నాటేలా కేటాయింపులు చేయాలని కోరతామని ఆయన తెలిపారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న భూములు పెద్ద వ్యాపారులకు కామధేనువులా ఆదాయాన్ని అందించే మార్గాలుగా మారాయని, వారిని ప్రశ్నించే దిక్కు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గౌడ వృత్తిని కొనసాగించాలని ఈ తరం యువత కోరుకోవడం లేదని, అయినప్పటికీ 72 ఏళ్ల వయసులో కూడా ఒక వృద్ధుడు తాటిచెట్టు ఎక్కుతున్నాడంటే, ఆ కుటుంబానికి ఆ వృత్తి ఎంత అవసరమో అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. తాటిచెట్టు ఎక్కేవారు వ్యాపారం కోసం కాదు, తమ కుటుంబాలను పోషించడానికి మరో మార్గం లేక, ప్రాణాలను పణంగా పెట్టి ఎక్కుతున్నారని ఈటల వివరించారు. గౌడ సోదరుల జీవితాలు ఇంటికి సురక్షితంగా తిరిగి వచ్చే వరకు నమ్మకం లేని జీవితాలని ఆయన అన్నారు. తాటిచెట్లను నరికే ముందు గౌడ సమాజానికి తగిన పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడ ఉన్న ఐదు ఎకరాల భూమిని గౌడ సొసైటీకి కేటాయించాలని, కొత్త రకం తాటిచెట్లను నాటి, వాటిని జీవనాధారంగా మార్చుకునే అవకాశం కల్పించాలని ఆయన ప్రతిపాదించారు. ఈ భూమి కేటాయింపు కోసం కలెక్టర్, మంత్రి, చీఫ్ సెక్రటరీలకు లేఖ రాయనున్నట్లు ఈటల రాజేందర్ తెలిపారు.

# స్థానిక ఎన్నికల్లో కొత్త రిజర్వేషన్లు : పీసీసీ చీఫ్

- త్వరలోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు
- రిజర్వేషన్లు తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలు
- త్వరలో డీసీసీ అధ్యక్షుల నియామకం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయం

**టీపీఎన్, హైదరాబాద్ :**




బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఈ విషయంపై న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు 10 మంది సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. తన స్థాయికి కేటీఆర్ స్పందించడం సరికాదని మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజల సమస్యలపై చర్చించాలంటే అసెంబ్లీ అందుబాటులో ఉందని, ప్రతిపక్షాలకు అధిక సమయం కేటాయించామని ఆయన అన్నారు. ఈ నెల 15వ తేదీలోపు కొత్త డీసీసీ కమిటీలు ఏర్పాటవుతాయని, డీసీసీ ఎన్నికల కోసం సీనియర్ ఇన్‌ఛార్జ్‌లను నియమించినట్లు చెప్పారు. డీసీసీ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తయిన తర్వాత డీసీసీ అధ్యక్షుల నియామకం జరుగుతుందని, ఈ విషయంపై ఏఐసీసీ అబ్జర్వర్లు త్వరలో రాష్ట్రానికి వస్తారని తెలిపారు. ఈ నెలాఖరు నల చివరి నాటికి అన్ని కమిటీల ఏర్పాటు పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు.బీఆర్ఎస్ యూరియా కరువు గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం యూరియా సరఫరాను పెంచిందని, అయినప్పటికీ బీఆర్ఎస్ అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని తమ ఆలోచనగా ఉందని, ఈ విషయంపై న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నట్లు ఆయన పునరుద్ఘాటించారు. అనిరుద్ రెడ్డి విషయంపై మల్లు రవి విచారణ జరుపుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువగా ఉందని, అందుకే నిరసనలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఆపరేషన్ ఆకర్ష్ ఇంకా కొనసాగుతోందని, త్వరలో మహిళల సీట్లతో పాటు అసెంబ్లీ స్థానాలు కూడా పెరుగుతాయని వెల్లడించారు.

మంత్రి పదవుల విషయం తన పరిధిలో లేదని, రాజకీయాల్లో కొన్నిసార్లు జూనియర్లకు మొదట అవకాశాలు వస్తాయని, అయితే సీనియర్లను కూడా పార్టీ గుర్తిస్తుందని ఆయన అన్నారు. ఎక్కడ ఉప ఎన్నికలు జరిగినా తాము సిద్ధంగా ఉన్నామని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తాము గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. సర్వేల్లో మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు 10 మంది సమర్థులు సిద్ధంగా ఉన్నారని, వేరే పార్టీల నుంచి అభ్యర్థులను ఎందుకు తీసుకోవాలని ఆయన ప్రశ్నించారు. తమ హయాంలో నిర్బంధాలు లేవని, అందుకే కవిత ధర్నాలు చేస్తోందని విమర్శించారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై మాట్లాడితే అరెస్టులు చేశారని, కాళేశ్వరం వద్దకు వెళ్లాలనుకుంటే నిర్బంధించారని ఆరోపించారు. తనను బొల్లారం పోలీస్ స్టేషన్‌లో సాయంత్రం వరకు ఉంచారని, ఎక్కడపడితే అక్కడ అరెస్టులు జరిగేవని ఆయన విమర్శించారు.

# సవాల్ విసిరి రేవంత్ ఢిల్లీకి పారిపోయారు : కేటీఆర్

**టీపీఎన్, హైదరాబాద్ :**



తెలంగాణలో కాంగ్రెస్ అరాచక పాలన వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. నోటికొచ్చిన హామీలు, 420 వాగ్దానాలు, వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు అని డైలాగులు కొట్టి, రాష్ట్రంలోని 70 లక్షల రైతులను, కోట్లాది కుటుంబాలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బాండ్ పేపర్‌పై రాసి గద్దె ఎక్కిన రేవంత్ రెడ్డి, 18 నెలల తర్వాత కూడా ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయారని విమర్శించారు. తెల్లారితే రేవంత్ రెడ్డి అరుపులు, గావు కేకలు, బూతులు తప్ప ఏమీ చేయలేదని, తెలంగాణ రైతాంగానికి, యువతకు ఎవరు ఏమి చేశారో తేల్చుకుందాం అని సవాల్ విసిరితే, బేసిన్ నాలెడ్జ్ లేని రేవంత్‌కు బేసిక్ నాలెడ్జ్ కూడా లేదని తెలిసినా, ముఖ్యమంత్రి ముచ్చటపడ్డాడని సవాల్ స్వీకరించానని కేటీఆర్ అన్నారు. 72 గంటల ప్రిపరేషన్ టైం ఇచ్చి, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని చెప్పానని, కానీ రేవంత్ ఢిల్లీకి పారిపోయారని విమర్శించారు.రేవంత్ రాలేకపోతే ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి లేదా ఇతర మంత్రులను పంపుతారని అనుకున్నా.. కానీ రేవంత్‌కు రచ్చ చేయడం తప్ప చర్చ చేయడం రాదని తేలిపోయిందన్నారు. రేవంత్‌కు బూతులు మాట్లాడడం వచ్చు కానీ రైతుల గురించి మాట్లాడడం రాదని, బేసిన్‌ల గురించి కూడా బేసిక్ నాలెడ్జ్ లేదని, ఇరిగేషన్ అధికారులను పిల్లాడిలా ప్రశ్నిస్తున్నాడని రైతులు బాధపడుతున్నారని అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్, కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి నీళ్లు, నిధులు, నియామకాల అన్న ప్రాతిపదికను కల్పించారని, కానీ రేవంత్ ఈ సిద్ధాంతాన్ని తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వాడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ రైతులను మోసం చేస్తూ, కృష్ణాగోదావరి నీళ్లను చంద్రబాబుకు పంపిస్తున్నారని, బనకచర్ల వద్ద గోదావరి నీళ్లు తీసుకెళ్తుంటే పచ్చ జెండా ఊపుతున్నారని, పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా నీళ్లను దొంగచాటుగా తీసుకెళ్తుంటే కళ్లు మూసుకున్నారని విమర్శించారు. నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి పోతున్నాయని, తన తొత్తులకు నియామకాలు ఇచ్చుకుంటూ రేవంత్ మురిసిపోతున్నారని, కాంగ్రెస్ అగ్రనాయకత్వం, బీజేపీ పెద్దలకు పైసల మూటలు మోస్తూ పదవిని కాపాడుకుంటున్నారని తెలంగాణ ప్రతి చిన్న పిల్లాడికి తెలుసన్నారు. ఎరువుల కొరత రైతులను సతమతం చేస్తోందని, ఒక ఆధార్ కార్డుతో ఒక ఎరువు బస్తా ఇస్తామంటే రైతులు చెప్పులు క్యూలో పెట్టి ఎదురుచూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాత దుర్దినాలను తీసుకొచ్చిందని, కరెంటు కోతలు, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయే రోజులు మళ్లీ వచ్చాయని, ఎరువులు, విత్తనాల కోసం లైన్లలో నిలబడే రోజులు తిరిగొచ్చాయని విమర్శించారు.రైతు శ్రేయస్సు, యువత ఉద్యోగాలపై చర్చకు సమగ్ర సమాచారంతో వచ్చామని.. సీఎం బిజీగా ఉంటారని మరో అవకాశం ఇస్తున్నామని, స్థలం, తేదీ, సమయం డిసైడ్ చేయండి, జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు రమ్మంటే కూడా వస్తామని, ఏ అంశంపై చర్చ అయినా కేసీఆర్ తయారు చేసిన గులాబీ సైనికులం సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీలో మైక్ ఇవ్వక టైమ్‌పాస్ చేస్తే ప్రజలు గమనిస్తున్నారని, చర్చకు రాలేకపోతే కేసీఆర్‌కి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్..!

తెలంగాణ రాజకీయాలు మంగళవారం రసవత్తరంగా మారాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ములుగులో అభివృద్ధిని అడ్డుకునేందుకు కేటీఆర్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

ములుగు నియోజకవర్గ కేంద్రంలో జరిగిన పత్రికా సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, కేటీఆర్ మోసపూరిత నాటకాలు కొనసాగిస్తే రాజకీయంగా నాశనమవుతారని హెచ్చరించారు. “చిన్న చిన్న రాజకీయాలు మాని, రచనాత్మక విపక్షంగా వ్యవహరించండి. అబద్ధాలు ప్రచారం చేస్తే, మీ స్వంత ప్రచారంతోనే నాశనమవుతారు,” అని హెచ్చరించారు.

కేటీఆర్ ఇటీవల చేసిన విమర్శలను ఉద్దేశించి, సీతక్క ఇలా అన్నారు: “నీ సొంత సోదరి నీపై దుమ్మెత్తిపోస్తోంది. నీ ఇంట్లో ఏం జరుగుతుందో ముందు చూసుకో, నా వైపు వేలు చూపే ముందు. నీలాగా నాకు కులం, అహం, లేదా వంశవృక్ష అధికార బలం లేదు. ములుగు ప్రజలే నా బలం.”

తన రాజకీయ ప్రయాణం త్యాగాలు, పోరాటాలతో నడిచిందని, తెలంగాణ ఉద్యమంలో తన అన్న మరణించాడని సీతక్క గుర్తు చేశారు. “నాకు డబ్బు, అధికార లాబీలు లేవు. ములుగు ప్రజలు ఆశీర్వదిస్తే మంత్రిని అవుతాను, బ్యాక్‌డోర్ రాజకీయాలతో కాదు. బీఆర్ఎస్ పాలనలో విపక్ష నాయకులను గృహనిర్బంధంలో ఉంచారని, మంత్రుల సందర్శనల సమయంలో విపక్ష నాయకులకు తాగునీరు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. “ఇప్పుడు నీవు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదు,” అని అన్నారు.

“తెలంగాణ ఉద్యమంలో ప్రజల మరణాలను ప్రేరేపించిన నీ ప్రభుత్వం, బాధిత కుటుంబాలను కలవలేదు. ఇప్పుడు మా పాలనను ప్రశ్నిస్తావా?” అని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాథమిక అభివృద్ధిని కూడా అందించలేకపోయిందని సీతక్క విమర్శించారు. “మీ 10 సంవత్సరాల పాలనలో ములుగులో వెయ్యి ఇళ్లు కూడా నిర్మించలేదు. మా పనిని విమర్శించే హక్కు మీకు ఎక్కడిది?” అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ములుగులో ఎలాంటి అణచివేత లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తోందని సీతక్క తెలిపారు. “ప్రజలు ఇప్పుడు కులీన రాజకీయాల కుట్రలను అర్థం చేసుకుంటున్నారు. ప్రజల శ్రేయస్సు నీకు నిజంగా ముఖ్యమైతే, నాటకాలు మాని అభివృద్ధికి మద్దతు ఇవ్వు,” అని సీతక్క కేటీఆర్‌కు సూచించారు.

# మరో రికార్డుకు సిద్ధమైన బండి సంజయ్.. 20 వేల సైకిళ్ల పంపిణీ,,!





**టీపీఎన్, కరీంనగర్ :**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్‌లో మరో మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థినులు, విద్యార్థులకు రేపటి నుంచి ఉచిత సైకిళ్ల పంపిణీని ప్రారంభించనున్నారు. మొత్తం 20 వేల సైకిళ్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ఉపయోగించి బ్రాండెడ్ సైకిల్ కంపెనీ నుంచి కొనుగోలు చేశారు. ఒక ప్రజాప్రతినిధి తన నియోజకవర్గంలో 20 వేల సైకిళ్లను పంపిణీ చేయడం దేశంలోనే తొలిసారి కావడం విశేషం.

**తొలి రోజు కరీంనగర్‌లో పంపిణీ**

తొలి రోజు కరీంనగర్ టౌన్‌లో 10వ తరగతి చదివే విద్యార్థినులు, విద్యార్థులకు బండి సంజయ్ తన చేతుల మీదుగా సైకిళ్లను అందజేయనున్నారు. ఈ కార్యక్రమం కోసం అంబేద్కర్ స్టేడియంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. 21 స్టాల్స్‌ను రంగురంగుల బెలూన్లు, షామియానాలతో అలంకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, విద్యాశాఖ అధికారులతో సహా ఉన్నతాధికారులు హాజరవుతారు.

**నెల రోజుల్లో పంపిణీ పూర్తి**

నెల రోజుల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ పూర్తి చేయాలని బండి సంజయ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ బాధ్యతను జిల్లా కలెక్టర్ ద్వారా విద్యాశాఖ అధికారులకు అప్పగించారు. డీఈఓ, ఎంఈఓలు స్కూళ్ల వారీగా విద్యార్థుల సంఖ్యను లెక్కించి, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా సైకిళ్లను పంపిణీ చేయనున్నారు.

**విద్యార్థుల కష్టాలను తొలగించేందుకు సైకిళ్లు**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువగా పేద కుటుంబాల నుంచి వస్తారు. వారికి ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లడానికి రవాణా సౌకర్యాలు లేక, ఆటోలు, బస్సులు భరించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు స్పెషల్ క్లాసుల కోసం సాయంత్రం వరకు స్కూల్‌లో ఉండాల్సి వస్తుంది. ఈ సమస్యను గుర్తించిన బండి సంజయ్, సీఎస్ఆర్ నిధులతో 20 వేల సైకిళ్లను కొనుగోలు చేసి, ప్రధాని నరేంద్ర మోదీ కానుకగా పంపిణీ చేయనున్నారు.

**బండి సంజయ్ సేవా కార్యక్రమాలు**

బండి సంజయ్ తన పుట్టిన రోజును సాంప్రదాయ రీతిలో కేక్ కట్ చేయడం, సంబరాలు జరుపుకోవడం కాకుండా, పేదలకు సేవ చేసే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.5 కోట్ల విలువైన ఆధునాతన వైద్య పరికరాలు, అంబులెన్స్‌లు, ఫ్రీజర్లు, మెడిసిన్స్ అందించారు. కరోనా సమయంలో రోగులను నేరుగా కలిసి, మెడిసిన్స్, ఇంజెక్షన్స్, గ్లౌజులు అందించి, మనోధైర్యం నింపారు.

**వైద్య, విద్యా రంగాలపై దృష్టి**

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలోని ఆసుపత్రులకు రూ.2 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందించారు. 'సంజయ్ సురక్ష' పేరిట అంబులెన్స్‌లను అందించారు. వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లోని ఆసుపత్రులకు ఆధునాతన పరికరాలను సమకూర్చారు. ఈ కార్యక్రమాల ద్వారా వైద్య, విద్యా రంగాల్లో పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు బండి సంజయ్ నిరంతరం కృషి చేస్తున్నారు.



# మేడ్చల్‌లో కెమికల్ మాఫియాపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి..!

**టీపీఎన్, దుండిగల్ :**

రాత్రి వేళల్లో కెమికల్ మాఫియా బయటకు వస్తోందని, దీనిని అడ్డుకట్ట వేసేందుకు మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు చురుగ్గా పనిచేస్తున్నారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విశ్వసనీయ సమాచారం ఆధారంగా, రసాయన వ్యర్థాలు తరలిస్తున్న ఒక కెమికల్ ట్యాంకర్‌ను మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు గాగిల్లాపూర్ పెట్రోల్ బంక్ వెనుక పార్క్ చేసిన స్థితిలో స్వాధీనం చేసుకున్నారు. ట్యాంకర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న ట్యాంకర్‌ను ఎస్‌ఓటీ పోలీసులు దుండిగల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, ట్యాంకర్‌ను శాంపిల్స్ కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులకు అప్పగించారు.

**కెమికల్ మాఫియాపై స్థానికుల ఆగ్రహం**

దుండిగల్ మరియు మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో విష రసాయనాలను అక్రమంగా పారబోయడం సర్వసాధారణంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీసీబీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఈ ఘటనలకు కారణమని, రాత్రి వేళల్లో కూడా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు పీసీబీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఇది వారి నిర్లక్ష్యాన్ని సూచిస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**స్థానికుల డిమాండ్లు**

సంబంధిత కెమికల్ ఏ కంపెనీ నుంచి వచ్చిందనే విషయంపై విచారణ జరిపి, ఆ కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, ట్యాంకర్ యజమాని, డ్రైవర్‌పై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

**పోలీసుల కృషికి కృతజ్ఞతలు**

కెమికల్ మాఫియాను అడ్డుకోవడంలో మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు, సీఐ నేతృత్వంలోని టీం చేస్తున్న కృషిని స్థానికులు కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కెమికల్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ఏసీబీకి వలలో స్టేట్ డిప్యూటీ టాక్స్ ఆఫీసర్ సుధా..!

**టీపీఎన్, హైదరాబాద్ :**



రాష్ట్రంలో యాంటి కరప్షన్ బ్యూరో (ఏసీబీ) దూకుడు పెంచింది. వేలకు వేలు జీతాలు వస్తోన్న అడ్డదారుల్లో లంచాలు తీసుకుంటున్న అవినీతి అధికారుల భరతం పడుతోంది. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారులకు మరో అవినీతి అధికారిణి చిక్కారు. పని మీద వచ్చిన ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. మాదాపూర్ సర్కిల్ స్టేట్ డిప్యూటీ టాక్స్ ఆఫీసర్‌గా పని చేస్తోన్న సుధా.. ఓ కంపెనీకు సంబంధించిన జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రాసెస్ చేయడానికి వచ్చిన వ్యక్తిని రూ.8 వేలు లంచం డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఈ మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని గగన్ విహార్లో సదరు వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా రైడ్ చేసి టాక్స్ ఆఫీసర్ సుధాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం గగన్ విహార్లో తనిఖీలు చేశారు. నిందితురాలు సుధాపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు ఏసీబీ అధికారులు. ఇటీవల ఏసీబీకి చిక్కుతున్న వారిలో ఎక్కువగా మహిళా ఆఫీసర్లు ఉండటం గమనార్హం.

## దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో గురు పూర్ణిమ మహోత్సవ ఏర్పాట్లు

**టీపీఎన్, హైదరాబాద్ :**



దక్షిణ శిరిడిగా పేరుగాంచిన శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్, దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో గురు పూర్ణిమ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ చైర్మన్ శ్యామ్ కుమార్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని, పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి సాయిబాబాను దర్శించుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. గత 36 సంవత్సరాలుగా దిల్సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో గురు పూర్ణిమ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని చైర్మన్ శ్యామ్ కుమార్ వెల్లడించారు. ఈ ఏడాది జూలై 9 నుంచి 11 వరకు గురు పూర్ణిమ వేడుకలు జరగనున్నాయని తెలిపారు. సరూర్‌నగర్ సీఐ సైది రెడ్డి గురు పూర్ణిమ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి, కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు.



## హైకింగ్ ట్రయల్ పార్కు పనులు త్వరగా చేపట్టాలి : ఆర్.వి.కర్ణన్

**టీపీఎన్, హైదరాబాద్:**

జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 లో గల హైకింగ్ ట్రయల్ పార్క్ సుందరీకరణ పనులు త్వరితగతంగా చేపట్టాలని కమీషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖైరతాబాద్ కమీషనర్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి తో కలిసి కమీషనర్ పార్కు ను పరిశీలించారు. పార్కు అభివృద్ధి, సుందరీకరణ చేపట్టిన ప్లాన్ లో మార్పులు, చేర్పులు చేయాలని సూచించారు. రోడ్డు నంబర్ 36 నుండి నడుచుకుంటూ వెళ్లి రోడ్ నెంబర్ 25 వరకు మధ్యలో ఉన్న పార్కులు సందర్శించారు. పార్కు లో విజిటర్స్ కు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా అన్ని విధాలుగా సుందరీకరణ, అత్యవసర పనులు చేపట్టి నిర్దేశించిన కాల వ్యవధి లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమీషనర్ వెంట ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, సర్కిల్ 18 ఈ ఈ విజయకుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ బోనాల సన్నాహాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

**టీపీఎన్, హైదరాబాద్ :**



ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా అంబర్‌పేట మహంకాళి దేవాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హెచ్., కార్పొరేటర్లు, ఆలయ కమిటీ సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు, పోలీస్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, దేవాదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహంకాళి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అధికారులు తమ విధులను ఎటువంటి లోపం లేకుండా నిర్వహించాలని, గత సంవత్సరం జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు."వర్షం లేని సమయంలో 48 గంటల్లో రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలి. పోలీస్, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఈవ్ టీజింగ్ నివారణకు మహిళా పోలీసులను నియమించాలి. అమ్మవారి ఊరేగింపు రోజు రోప్ ఏర్పాటు చేసి, ప్రత్యేక పోలీస్ బృందాలను మోహరించాలి. నల్ల పోచమ్మ దేవాలయం వద్ద చైన్ స్నాచింగ్ నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలి. ఈ సంవత్సరం ఫ్లైఓవర్ ప్రారంభమైనందున, ట్రాఫిక్ డైవర్షన్ చేయాలి. సీపీఎల్ రోడ్డు గుండా ట్రాఫిక్ మళ్లించాలి. సోమవారం ఊరేగింపు రోజు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి. అదనపు శానిటేషన్ బృందాలు, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి. జలమండలి దేవాలయం వద్ద డ్రైనేజీ లీకేజీలు లేకుండా చూడాలి. మంచినీటి ప్యాకెట్లు అందించాలి. నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక జనరేటర్లు ఏర్పాటు చేయాలి. మహంకాళి ఆలయం వద్ద వాటర్‌ప్రూఫ్ స్టేజి, బారికేడ్లు ఏర్పాటు చేయాలి. మహంకాళి, నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాల వద్ద వేదికలు నిర్మించాలి. ఆర్టీసీ బస్సులు మహంకాళి ఆలయం వైపు వచ్చేలా ఏర్పాట్లు చేయాలి. అంబులెన్స్, మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలి. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఇంజన్‌లు, ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు. ఇకపోతే.. ఈ నెల 26న గోల్కొండ బోనాలతో ఆషాఢ మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జులై 1న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, జులై 13న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు, జూలై 20న లాల్ దర్వాజా బోనాలు జరగనున్నాయి.

జంట నగరాల్లో 3 వేలకు పైగా దేవాలయాల్లో బోనాల పూజలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల కోసం ప్రభుత్వం 20 కోట్ల రూపాయలు విడుదల చేసింది. అన్ని దేవాలయాలకు ఖర్చు కోసం చెక్కులు ఇప్పటికే పంపిణీ చేశారు. మంత్రులు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఉద్దేశించి, "బోనాల ఉత్సవాలు అమ్మవారికి సేవ చేసే అవకాశంగా భావించి, విధుల్లో నిమగ్నం కావాలి. ఎక్కడా అలసత్వం లేకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి," అని సూచించారు.

# బడంగ్‌పేట్ కమిషనర్‌పై బీజేపీ నేతల ఆగ్రహం..!

**టీపీఎన్, బడంగ్‌పేట్ :**



మున్సిపల్ కార్పొరేషన్ అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో ఆరోపించారు. కమిషనర్ వ్యవహార శైలికి నిరసనగా కార్పొరేషన్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆందోళనలో పాల్గొన్న బీజేపీ నేతలను పోలీసులు అరెస్టు చేసి మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పార్కుల స్థలాలు, పబ్లిక్ ప్రాపర్టీలు క్రమంగా భూ మాఫియా చేతుల్లోకి వెళ్తున్నాయని బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కోసం కేటాయించిన ఈ స్థలాలు కబ్జా అవుతున్నప్పటికీ, అధికార యంత్రాంగం నిశ్శబ్దంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కలెక్టర్ కార్యాలయం, సీడీఎంఏ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాలకు బీజేపీ తరఫున ఫిర్యాదులు చేసినప్పటికీ, కమిషనర్ కమీషన్ల కోసం అక్రమాలను ప్రోత్సహిస్తూ, కబ్జాదారులకు మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు ఒక్క విచారణ కూడా ప్రారంభించకపోవడం వల్ల కబ్జాలు మరింత పెరిగాయని తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్ అక్రమార్కులకు, కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కార్పొరేషన్ అధికారులు అక్రమదారులను ప్రోత్సహిస్తూ, అడ్డదారిలో పర్మిషన్లు ఇస్తూ, లక్షల రూపాయల అవినీతికి పాల్పడుతూ బడంగ్‌పేట్‌ను అవినీతి కేంద్రంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కాలనీ పార్కు స్థలంలో కబ్జా చేసి నిర్మాణాలు జరుగుతున్నా, దీనిపై ఫిర్యాదు చేసినా కమిషనర్ పట్టించుకోవడం లేదని, కబ్జాదారులను ప్రోత్సహిస్తున్న వారు ఎవరని ప్రశ్నించారు. ఈ అక్రమాలపై తక్షణం చర్యలు తీసుకోకపోతే, పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీజేపీ నేతలు హెచ్చరించారు.

# వైఎస్‌ఆర్ విగ్రహానికి కూన శ్రీశైలం గౌడ్ నివాళులు..!

**టీపీఎన్, కుత్బుల్లాపూర్ :**

షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్, దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి షాపూర్ నగర్ చౌరస్తా వద్దకు కాలినడకన బయలుదేరి, వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి మంగళవారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి సుపరిపాలన, అభివృద్ధి, రాజనీతిగా మైన ఆలోచనలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. వైఎస్‌ఆర్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళ సంఘాల అభివృద్ధికి పావలా వడ్డీకి రుణాలు అందించారని గుర్తు చేశారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలను, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఫీజు రియంబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి, రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ సంఘాల నాయకురాళ్లు, యువజన సంఘాల నాయకులు, NSUI నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# సిగాచి ప్రమాదస్థలిని పరిశీలించిన NDMA బృందం..!

**టీపీఎన్, పాశమైలారం :**



సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనను నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (NDMA) బృందం పరిశీలించింది. సుమారు నాలుగు గంటల పాటు NDMA అధికారులు పరిశ్రమలో విచారణ జరిపారు. పేలుడు కారణంగా కూలిపోయిన భవనం, దెబ్బతిన్న పరికరాలను పరిశీలించి, భద్రతా ప్రమాణాల గురించి కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించారు. అనంతరం, అక్కడే సమావేశం నిర్వహించి, నిర్వహణ లోపాలపై సిగాచి యాజమాన్యాన్ని నిలదీశారు. ఈ అధ్యయనంలో గుర్తించిన అంశాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సమర్పించనున్నారు.

పాశమైలారం పేలుడు ఘటనలో ఇప్పటికీ 8 మంది కార్మికుల ఆచూకీ లభించలేదు. వారి కోసం అగ్నిమాపక, ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా, పోలీసు బృందాలు శిథిలాల కింద గాలింపు చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. గల్లంతైన తమ వారి కోసం బాధితుల కుటుంబాలు సహాయ కేంద్రం వద్ద ఆందోళనతో ఎదురు చూస్తున్నాయి. ఐలాలోని హెల్ప్ డెస్క్ వద్ద అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ బాధిత కుటుంబాలతో మాట్లాడి, ఆఖరి వ్యక్తి ఆచూకీ తెలిసే వరకు సహాయ చర్యలు కొనసాగుతాయని హామీ ఇచ్చారు.

పేలుడు ఘటన జరిగి 9 రోజులు గడిచినప్పటికీ, గల్లంతైన కార్మికుల ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషాద ఘటనలో మృతుల సంఖ్య 44కు చేరింది. సంగారెడ్డిలోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అఖలేశ్వర్, బీరంగూడ సమీపంలోని పనీషియా మెరిడియన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరిఫ్ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. పేలుడు తర్వాత ఆసుపత్రుల్లో చేరిన వారిలో గత వారంలో 8 మంది మరణించారు. ప్రస్తుతం 16 మంది కార్మికులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

# యనమల రాజుకు అరుదైన గౌరవం..
# బెస్ట్ రీ సేల్ రియల్టీ అవార్డ్ తో సత్కారం

**టీపీఎన్, హైదరాబాద్ :**

నగరానికి చెందిన యనమల రాజుకు అరుదైన గౌరవం లభించింది. ఎలాంటి విద్యార్హత, కుల, మత, ప్రాంత, లింగ బేధం లేకుండా వందలాది మంది నిరుద్యోగులు, గృహిణులు, చిరు ఉద్యోగులు, వ్యాపారంలో నష్టపోయిన వారికి అండగా నిలవడంతో పాటు, తీవ్రమైన అప్పుల బాధలో ఉండి చావే శరణ్యమనుకున్న ఐదొందల మంది నిరాశ్రయుల్ని లక్షాధికారుల్ని చేసినందుకు గానూ ఆయన్ను.. బెస్ట్ రీ సేల్ రియల్టీ అవార్డు వరించింది. హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని ఆదిత్య కన్వేషన్ సెంటర్‌లో బిజ్ నెట్ వర్క్, రియల్టీ సిండికేట్ వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో యనమల రాజుకు ఈ అవార్డును ర్యక్రమంలో బిజ్ నెట్ వర్క్ సిఈఓ నారాయణ స్వామి, రియల్ ఎస్టేట్ సిండికేట్ ప్రతినిధులు తమ్మిశెట్టి సుధాకర్ తదితరులు అందజేశారు.. యనమల డెవలపర్స్ కంపెనీ ద్వారా... భూముల రేట్లు పెరగడం, ప్రమోషన్, మార్కెటింగ్, కంపెనీ లాభలు తదితర వాటి వల్ల... కొత్త ప్లాట్ల రేట్లు కస్టమర్ల కు భారంగా మారిన నేపథ్యంలో... పాత ప్లాట్లనే రీ సేల్ చేస్తున్నారు. దీని వల్ల... షాద్ నగర్ లాంటి చోట 6 లక్ష్యాలకే ఆడబిడ్డకు ప్లాట్ ఇస్తూ, కొనిపించడమే కాదు... అవసరమైతే అమ్మించడం కూడా మా బాధ్యత



అంటూ, మార్కెట్ రేట్ కంటే 30% తక్కుకు ఇస్తూ.. ఏడాది వ్యవధిలోనే 500 పైగా రీ సేల్ ప్లాట్లు విక్రయించారు..ఈ నేపథ్యంలోనే ఓ వైపు ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగ యువతకు ఉపాధిమార్గం చూపిస్తున్నారు.. ఆయన స్థిరాస్తి రంగంలో పొదుపు, ఇన్వెస్ట్మెంట్, ట్రేడింగ్ ప్రాపర్టీ, మార్కెటింగ్, సేల్స్ మెలుకువలు , పెట్టుబడియేతర బిజినెస్ తదితర అంశాలపై ఆర్టికల్స్ రాస్తూ, ఆయా ఛానెల్స్ లో ఇంటర్వ్యూస్ ఇస్తూ.. ఎందరినో చైతన్య పర్చారు , రియల్ ఏస్టేట్ ఫ్రీలాంచ్, స్కీమ్ మోసాలు, లాభాలు, డాక్యుమేంటేషన్ తదితర.. ఏ రంగం, ఏ ప్రాంతం, ఏటైంలో ఇన్వెస్ట్ చేస్తే బాగుంటుందో ఇన్వెస్టర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

# నష్టపరిహారం తేల్చకుండా భూములు తీసుకోవడం సరికాదు..!

**టీపీఎన్, చేవెళ్ల :**

మోయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి వార్డ్ రెవెన్యూలో సర్వేనెంబర్ 180లో 99.14 ఎకరాల భూమి ప్రభుత్వం గోశాలకు కేటాయిస్తూ సర్క్యులర్ జారీ చేసి భూమి పూజ చేయడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది.ఈ సందర్భంగా సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ...ప్రభుత్వం ఎన్కెపల్లి రైతుల భూములకు ఎలాంటి నష్టపరిహారం తేల్చకుండా భూమి పూజ చేయడం సరైనది కాదు అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో కేంద్రంలో ఉన్నప్పుడు తీసుకువచ్చిన 2013 భూ సేకరణ చట్ట ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలి లేదా రైతుల కోరుతున్న విధంగా నష్టపరిహారాన్ని తేల్చి తర్వాత రైతుల భూములు తీసుకోవాలని అన్నారు. తరతరాలుగా ఆ భూములలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలకు అన్యాయం చేయాలని చూస్తే సిపిఎం పార్టీ ఎర్ర జెండా ఊరుకోదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి నష్టపరిహారం తేల్చకుండా ఆ భూముల జోలికి రావద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్కెపల్లి రైతులకు నష్ట పరిహారం వచ్చేంతవరకు సిపిఎం పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు.ఆ భూమి సాగు చేసుకుంటున్నా వారందరూ దళితులు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే కాబట్టి



ప్రభుత్వం రెవెన్యూ యంత్రాంగం వారికి మేలు జరిగేటట్లు నష్టపరిహారాన్ని వెంటనే తేల్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మోయినాబాద్ సిపిఎం నాయకులు ఎన్కెపల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

స్వయం సహాయక సంఘాలకు 20232024 మరియు 20242025 సంవత్సరాలకు గాను వడ్డీ లేని రుణాలను ఈ వారంలో జమ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసిందని కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం బోరబండలోని షహీద్ టుర్రె బాజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక పట్టణ మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాబా ఫసియుద్దిన్ మాట్లాడుతూ.. వార్డ్ స్థాయిలో సమాఖ్య సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాల గురించి అందరికీ తెలియజేయాలని సూచించారు. సర్కిల్ పరిధిలో మంజూరైన వడ్డీ లేని రుణాల చెక్కులను త్వరలో నియోజకవర్గం వారీగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. ప్రతి మహిళా స్వయం సహాయక సంఘంలో చేరి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. అనంతరం, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట్ కిషన్ రావు, కమ్యూనిటీ ఆర్గనైజర్, యూసీడి సిబ్బంది, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు, సమైక్య అధ్యక్షురాళ్లు, ఆర్పీలు, బస్తీ అధ్యక్షులు ఆనంద్, మహేందర్ గౌడ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 10న వేలం

**టీపీఎన్, మేడ్చల్ :**

ఈ నెల 10 వ తేదిన వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలకు వేళం పాట నిర్వహించడం జరుగుతుందని మేడ్చల్ ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు. రంగారెడ్డి జిల్లా డిప్యీటి కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో వేళం వేయడం జరుగుతుందని తెలిపారు. సీజ్ చేసిన వాహనాలలో హోండా ఆక్టీవా, హీరో హోండా, డియో, హీరో స్పెండర్ వాహనాలు ఉన్నాయని సీఐ నవనీత చెప్పారు. ఈ వేలంలో పాల్గొనవలసిన వారు ప్రవేశ రుసుముగా 5 వేల నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.






## 38 కిలోల గంజాయి పట్టివేత..!

**టీపీఎన్, చేవెళ్ల :**

గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను మోకిలా పోలీస్ స్టేషన్ సిబ్బంది , రాజేంద్రనగర్ జోన్ ఎస్ ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సాయంత్రం నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం లోని గంజం జిల్లాకు చెందిన దశరథి ప్రధాన్ అలియాస్ దాసు, సిబరం నహక్, నిలు మండల్ , సాగర్ సాస్మల్ అక్రమ మార్గంలో ఈజీగా డబ్బులు సంపాదించాలని అనుకున్నారు. ఇందుకోసం వారి రాష్ట్రంలోని గంజాయి సరఫరాదారుల నుంచి కొనుగోలు చేసి, హైదరాబాద్ నగర శివార్లలో గల కార్మిక ప్రాంతాల్లో విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అక్కడి నుంచి గంజాయిని తీసుకొచ్చి ప్యాకెట్ల రూపంలో నిల్వ చేసుకొని రవాణా చేస్తున్నారు. మంగళవారం సమాచారం అందుకున్న పోలీసులు మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలోని కొల్లూరు గేట్ సమీపంలోని బృందావనం గార్డెన్స్ వద్ద వారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 38 కిలోల గంజాయి, 5 మొబైల్ ఫోన్లు, రూ. 2 వేలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా నేరం ఒప్పుకోవడంతో ఎన్ డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని ఏసీపీ తెలిపారు.

## బీజేపీ బీసీ నేతలు వెంటనే రాజీనామా చేయాలి..!

**టీపీఎన్, కరీంనగర్ :**

తెలంగాణ రాష్ట్రంలో అధ్యక్ష పదవి బీసీలకు ఇస్తానని ఆశ చూపి చివరికి బీజేపీ బీసీలను మోసం చేసిందని కరీంనగర్ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొంగోని శ్రవణ్ మండిపడ్డారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలను కాదని ఒక శాతం ఉన్న అగ్ర కుల సామాజిక వర్గానికి పార్టీ అధ్యక్షుడి పదవిని బిజెపి కట్టబెట్టి బీసీలను దగా చేసిందన్నారు. అందుకు బీజేపీలో ఉన్న బీసీ నాయకులు ఏమాత్రం ఆత్మగౌరవం ఉన్న తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీని సీఎం చేస్తానని.. చివరికి ఫ్లోర్ లీడర్ పోస్ట్‌ను కూడా అగ్రకులానికి చెందిన మహేశ్వర్ రెడ్డికి కట్టబెట్టి బీజేపీ మాటలకు చేతులకు ఎక్కడా పొంతన లేదని రుజువు చేసుకున్నదని దుయ్యబట్టారు. బీజేపీ అంటే ఇప్పుడు బ్రాహ్మణ జనతా పార్టీగా మారిపోయిందని.. బీసీలను మోసం చేసిన బీజేపీని ఈ రోజు నుండి బీసీల ద్రోహిగా భావించాలన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీని బీసీలే రాజకీయంగా భూస్థాపితం చేస్తారని బొంగోని శ్రవణ్ జోస్యం చెప్పారు.





## నకిలీ ఔషధాల కేసులో వ్యక్తి అరెస్ట్..!

**టీపీఎన్, హైదరాబాద్ :**


తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (DCA) అధికారులు, మానవ ఆరోగ్యానికి ప్రమాదకరమైన నకిలీ (స్పూరియస్) ఔషధాల నిర్వహణలో పాల్గొన్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ నగర్, ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలోని అర్వింద్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ సంస్థలో పార్ట్‌నర్ మరియు కంపిటెంట్ పర్సన్‌గా ఉన్న మనీష్ కుమార్‌ను మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ అరెస్ట్, సన్ ఫార్మా లాబొరటరీస్ లిమిటెడ్ తయారు చేసినట్లు తప్పుడు క్లెయిమ్ చేసిన లెవిపిల్ 500 టాబ్లెట్లు (లెవెటిరాసిటామ్ టాబ్లెట్లు 500 mg) అనే నకిలీ ఔషధాల స్వాధీనానికి సంబంధించినది. అరెస్టు తర్వాత, నిందితుడిని సికింద్రాబాద్‌లోని గౌరవనీయ అదనపు చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ (ACJM) కోర్టులో హాజరుపరిచారు. కోర్టు జూలై 23, 2025 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అనంతరం నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ శ్రీ షాహనవాజ్ ఖాసిం, ఐపీఎస్, నకిలీ ఔషధాల తయారీ, సరఫరా లేదా విక్రయాలలో పాల్పడే ఔషధ దుకాణాలు, డీలర్లు మరియు ఫార్మసీలపై జీరో టాలరెన్స్‌ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొన్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని, చట్టం ప్రకారం న్యాయస్థానంలో లోను చేయాలని సూచించారు.

- ఖండతరాలు దాటిన తిరుమల విద్యాసంస్థలు...
- కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ... గుజరాత్ నుంచి మిజోరామ్, నాగాలాండ్ వరకూ...
- ఐఐటీ, ఎన్ఐటీ, బిట్స్‌లో వేలాదిమంది తిరుమల విద్యార్థులే..
- అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకూ 700మందికి పైగా ఉన్నత ఉద్యోగాల్లో..
- త్వరలో విశ్వవిద్యాలయంగా మారనున్న తిరుమల విద్యా సంస్థ



# వికసించిన తిరుమల కుసుమాలు..!






భారత దేశంలో ఇటు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకూ అటు గుజరాత్ నుండి మేఖాలయ, అస్సాం, అరుణాచలప్రదేశ్ ప్రాంతాలైన మిజోరామ్, మణిపూర్, నాగాలాండ్ వరకూ అంటే మొత్తం భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో గల ఐఐటీ, ఎన్ఐటి, ఐఐఐటి (ట్రిబుల్ ఐఐటి), బిట్స్ వంటి పేరెన్నికగన్న టాప్ విద్యా సంస్థల్లో తిరుమలకు చెందిన సుమారు 4వేలకు పైగా విద్యార్థులు అభ్యసిస్తూ తిరుమల ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. గత రెండేళ్ళ క్రితమే దేశంలోని అన్ని ఐఐటిల్లో తిరుమల విద్యార్థులు 1126సీటు సాధించగా 2301 మంది, ట్రిబుల్ ఇబబటిలో 380 మంది, బిట్స్‌లో 95 మంది వెరసి దేశవ్యాప్తంగా 3902 నుంచి తిరుమల విద్యార్థులు సీట్లు సాధించారంటే తిరుమల విద్యా సంస్థ ఖ్యాతి ఏ రేంజ్ లో ఉందో స్పష్టమౌతుంది. ఈ సమయంలో గత రెండేళ్ళలోపువి. అప్పటి నుండి ఈ విద్యా సంవత్సరం జతచేస్తే సుమారు 7వేల మంది విద్యార్థుల వరకూ దేశంలో అన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ తిరుసుల విద్యార్థులు హవా కొనసాగుతుందనే చెప్పాలి. దేశంలో ఉన్న ఐఐటి, ఎన్ఐటి, ట్రిబుల్ ఐఐటి, బిల్స్ వంటి అన్ని విద్యా సంస్థల్లోనూ ఒకే సంస్థకు చెందిన విద్యార్థులు ఉండటం అసంభవం. అలాగే అమెరికా నుండి ఆస్ట్రేలియా వరకూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐటి కంపెనీల్లో తిరుమల విద్యార్థుల ఉద్యోగాలు సంపాదించారు. ఈఘనత కేవలం ఒక్క తిరుమల విద్యా సంస్థలకే తగ్గింది అనడంలో అతిశయోక్తిలేదనే చెప్పాలి. ఏదైనా విద్యా సంస్థ విజయాలు సాధించినా, ఆ సంస్థలోని విద్యార్థులు ఉన్నతంగా రాణించినా ఆ ప్రాంతం వరకే తెలుస్తుంది. అయితే ఒక విద్యా సంస్థలోని విద్యార్థులు దేశంలోని కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకూ గుజరాత్ నుండి మిజోరామ్, నాగాలాండ్ వరకూ దేశం అంటే నలుమూలలుగా ఉన్న దేశం ఐఐటి, ఎన్ఐటి, ఐఐఐటి, బిట్స్‌లో వేలాది మందికి పైగా విద్యార్థులు ఒకే సంస్థకు చెందిన వారు ఉన్నారంటే ఆ విద్యా సంస్థ ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందో స్పష్టమౌతుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి సమీపంలోని కాతేరులో ఉన్న తిరుమల విద్యా సంస్థలోని విద్యార్థులు ఒక్క భారతదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా వందల సంఖ్యలో ఉన్నారంటే తిరుసుల సంఖ్య స్టాండర్స్ ఏ స్థాయిలో ఉన్నాయో తేటతెల్లమవుతుంది. అమెరికా నుండి ఆస్ట్రేలియా వరకూ ప్రఖ్యాత యూనివర్శిటీల్లో ఉన్నత చదువులు కాకుండా ప్రపంచంలోనే ప్రఖ్యాత గాంచిన ఇది టెక్నాలజీ కంపెనీల్లో కూడా విద్యార్థులు ఉద్యోగాలు చేస్తున్నారంటే తిరుమల ఖ్యాతి ఖండాంతరాలు దాటింది అనడంలో అతిశయోక్తి లేదు. త్వరలో తిరుమల విశ్వవిద్యాలయం దిశగా తిరుమల విద్యా సంస్థలు మారనున్నాయి.

తిరుమలలోని వెంకటేశ్వరుని సన్నిధిని వైకుంఠంతో పోలుస్తారు... అందుకనే తిరుమలని ఆనందనిలయంగా భక్తజనకోటి. భావిస్తున్నారు. ఒక్కసారి కలియుగదైవమైన శ్రీవేంకటేశ్వర స్వామిని వీక్షిస్తే జన్మచరితార్థంగా భావించి పులకరించి ఆధ్మాతికతో తరిస్తారు... అయితే రాజమహేంద్రవరంలోని గోదావరి తీరంలో ఉన్న తిరుమల విద్యా సంస్థలో తమ పిల్లలను చేర్చుకుంటే అదే తమ పిల్లల భవిష్యత్‌కు కొండంత భరోసాగా నిలుస్తోందనీ తల్లిదండ్రులు భావిస్తున్నారు. తిరుమల అంటేనే పవిత్రమైనదని (తిరు అంటే పవిత్రమైన మల అంటే కొండ అని అర్థం) అంటారు. (యాదృశ్చికమో లేదా కాకతాళీకమో గాని తిరుమల విద్యా సంస్థల అధినేత పేరుకూడా తిరులమలరావే... అందుకనే పవిత్ర తిరుపతిని నిత్యం స్మరించేలాగ తిరుపతిలో ఉన్న ఏడు కొండలకు కున్న పేర్లను కూడా తిరుమల విద్యా సంస్థలోని భవనాలకు నామకరణం చేశారు... తిరుమల అంటేనే ఆధాత్మికతకు ప్రతీక.. అదే తిరుమల విద్యాసంస్థలోనూ ఉంచాలంటే నున్న తిరుమలరావు (ఎన్.టి.ఆర్) తో పాటు తిరుమల విద్యా సంస్థ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక బృందంలో ఏఒక్కరూ కూడా మద్యం అనేది ముట్టరంటే అధ్యాపకుల ఎంపికపై తిరుమలరావు శ్రద్ధగా ఉందో అర్థం చేసుకోవచ్చు... సర్వసాధారణంగా విద్యా వ్యాపారం చేసేవారు ఒక వ్యాపార దృక్పథంతో చూస్తారు. అయితే దీనికి భిన్నంగా తిరుమలరావు నిత్యం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూనే ఉంటారు. సాధారణంగా పేరెనికగన్న విద్యా సంస్థల్లో సీటు కోసం ప్రముఖుల సిఫార్సులు సర్వసాధారణం. అయితే తిరుమలకు కూడా ప్రముఖుల సిఫార్సులు తాకిడి ఎంతో ఎక్కువగానే ఉంటుంది. అయితే దీనికి భిన్నంగా, తిరుమలరానే స్వయంగా ప్రముఖులకు, ప్రజా ప్రతినిధులకు, బడా వ్యాపారవేత్తలకు ముందుగానే ఫోన్లు చేసి తమ విద్యాసంస్థలోని సీట్లు అన్నీ అయిపోయాయి.. దయ ఉంచి సిఫార్సులు లేఖలు, ఫోన్లు చేయవద్దంటూ అభ్యర్థిస్తున్నారంటే తిరుమలలో సీటు పొందాలంటే తల్లిదండ్రులు ఎంత కష్టపడాలో స్పష్టం అవుతుంది. అలాగని వచ్చిన ప్రతీ విద్యార్థికి తిరుమల విద్యాసంస్థలో చోటు దక్కే పరిస్థితి ఉండదనే చెప్పాలి. ఇతర ప్రాంతాల నుండి ఇతర విద్యాసంస్థల నుండి వచ్చిన విద్యార్థులకు ఒకటికి రెండుసార్లు విద్యార్థి సామర్థ్యంపైనా, సబ్జెక్టా " పరీక్షలు నిర్వహించి ప్రాథమిక పరీక్షల ద్వారా వడబోసి సీట్లు కేటాయిస్తారు. అందుకనే రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ అయినా, వైద్య, పాలిటెక్నికల్, నీట్, ఐఐటి అయినా మొదటి పది ర్యాంకులు, అలాగే మొదటి 100 ర్యాంకుల లోపు తిరుమల విద్యార్థులు ఉండితీరాల్సిందే అంటున్నారు తల్లిదండ్రులు... తిరుమలలో చేరితే విద్యార్థులను ఉతికి ఆరేస్తారు. ఉదయం నుండి రాత్రి వరకూ తోమేస్తారు అని ఇతర విద్యాసంస్థల నుండి ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ తల్లిదండ్రులు మాత్రం విద్యా తిరుమల సంస్థలపై గిట్టనివారు చేసే దుష్ప్రచారాలు తప్ప తమ పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచి ర్యాంకులు సాధించే విధంగా కృషిచేస్తున్న తిరుమల సేవలను బహిరంగంగానే కొనియాడుతున్నారు. ఇక పాఠాలు చెప్పే అధ్యాపక బృందాన్ని కూడా తిరుమలరావు ఎంతో గౌరవంగానే చూస్తారు. అధ్యాపకులు ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలకు పాఠాలు బోధిస్తారనే ఉద్దేశ్యంతో అధ్యాపకుల ఆరోగ్యం కోసం కూడా జిమ్ ఏర్పాటుచేశారంటే అధ్యాపకులు శ్రేయస్సు కూడా ఆయన ఏ స్థాయిలో పర్యవేక్షిస్తారో స్పష్టమౌతుంది. సర్వసాధారణంగా ప్రతీ ప్రయివేట్ స్కూల్ విద్యాసంస్థలు పునఃప్రారంభానికి నెలరోజుల నుండి ఆయా విద్యా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, బోధనా సిబ్బందికి కూడా టార్గెట్స్ ఇచ్చి ఇంటింటికి తిరిగి అడ్మిషన్లు చేస్తారు. కొన్ని సందర్భాల్లో అడ్మిషన్స్ చేయించని అధ్యాపకులను కొనసాగించకుండా నిలిపివేసిన దాఖలాలు కూడా కోకొల్లలు.. అయితే దీనికి విరుద్ధంగా తిరుమలలో పనిచేసే శిక్షణ బృందం గానీ, రిప్రజెంటేటివ్స్ గాని ఏ ఒక్క విద్యార్థి ఇంటికి వెళ్లి తమ స్కూల్లో చేర్పించాలనీ చెప్పిన దాఖలాలు లేవనే చెప్పాలి.

**నిత్యం సందడి**

పిల్లలను స్కూల్లో జాయిన చేశాము.. ఫీజులు కట్టేసాం... బస్సు ఫీజులు చెల్లించాము... విద్యాసంవత్సరం వరకూ మనం స్కూలు వంద చూడనవసరం లేదు ..... మనం చూసుకోఅబ్బర్లద్దు అని తల్లిదండ్రులు భావిస్తున్నారు. అయితే తిరుమల విద్యా సంస్థలో మాత్రం ప్రతీ విద్యార్థి నడవడికి, చదువు, సంస్కారం పై నిత్యం ఆరా తీయడమే కాకుండా చదువులో వెనుకబడినా, ప్రవర్తనలో తేడా వచ్చినా స్వయంగా తిరుమలరావు విద్యార్థికి క్లాసు పాడతారు. అందుకనే వేలాది మంది విద్యార్థులు పేర్లు కూడా తిరుమలరావు గుర్తుపెట్టుకుని చెప్పగలరంటే విద్యార్థులతో ఆయన మమేకమయ్యే పద్ధతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. పొరపాటున ఏ విద్యార్థి అయినా క్రమశిక్షణ తప్పి మాట వినకపోతే తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థి ఎదురుగానే చెబుతారు. అనంతరం కూడా విద్యార్థి ఎలా నడుస్తున్నాను. నడవడిక, అల్లరి, చిల్లర పనులపై తిరుమలలో అధ్యాపకులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారు. అందుకనే తిరుమల స్కూల్లో తమ పిల్లలను జాయిన్ చేస్తే నిత్యం తిరుమల నుండి అనుబంధం ఉన్నట్టుగానే తల్లిదండ్రులు భావిస్తాడు...

**నిరాడంబరతే ఆయన గుర్తింపు...**

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విశాఖ, విజయవాడ, హైద్రాబాద్ వంటి ప్రాంతాలకు తిరుమల విద్యాసంస్థ సుపరిచితమే. అయితే ఆయా ప్రాంతాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు నర్సరీ నుండి తిరుమలలో చదివినవారే...ఒకవైపు ఎంబీబీఎస్, నీట్, మరొకవైపు ఇంజనీరింగ్, ఐఐటిల్లో వేలాది ర్యాంకులు సాధించిన విద్యార్థులు నేడు దేశం, విదేశాల్లో చదువుతూ ఇండియా వచ్చిన ప్రతీసారి తిరుమలరావు సార్ నీ కలవందే వెళ్లరంటే విద్యార్థులతో తిరుమలరావుకు ఉన్న అనుబంధం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎంత ఎత్తుఎదిగినా ఒదిగుండాలంటే సామెత తిరుమలరావుకు సరిగ్గా సరిపోతుందని తల్లిదండ్రులు కితాబిస్తారు.





# ఎయిరిండియా ప్రమాదంపై నివేదిక

- **కేంద్రానికి అందజేసిన ఏఏఐబీ**

**టీపీఎన్, ఢిల్లీ :**

యావత్ ప్రపంచం ఉలిక్కిపడేలా చేసిన గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమాన ప్రమాదంకు సంబంధించి ప్రాథమిక నివేదిక సిద్ధమైంది. ఈ రిపోర్ట్ ను కేంద్రానికి చేరింది. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేసిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB) పౌర విమానయాన మంత్రిత్వ శాఖ , ఇతర సంబంధిత అధికారులకు తన ప్రాథమిక నివేదికను అందజేసింది. ఈ నివేదిక దర్యాప్తులో భాగంగా సేకరించిన ఫలితాల ఆధారంగా పొందపర్చినట్టు తెలుస్తోంది. ఈ వారం చివర్లో ఈ నివేదికను ప్రజలకు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక నివేదికలోని విషయాలు తెలియనప్పటికీ, ప్రమాదానికి కారణంపై కీలకమైన సమాచారం లభిస్తుందని భావిస్తున్నారు.

జూన్ 12న అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన 32 సెకన్లలోనే కూలిపోయింది. 10 మంది క్యాబిన్ సిబ్బంది , ఇద్దరు పైలట్లు సహా విమానంలో ఉన్న 270 మందికిపైగా సజీవ దహనమయ్యారు. ఈ భయంకరమైన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ చనిపోయారు. 11A సీటులో కూర్చున్న ఒకరు మాత్రమే ఈ విషాదం నుండి బయటపడ్డారు.విమానం యొక్క బ్లాక్ బాక్స్‌లు కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (CVR) ఫ్లైట్ డేటా రికార్డర్ (FDR) తరువాతి రోజుల్లో లభించాయి. జూన్ 13న క్రాష్ సైట్‌లోని భవనం పైకప్పు నుండి మరొకటి జూన్ 16న శిథిలాల నుంచి లభించింది.

జూన్ 25 నాటికి బ్లాక్ బాక్స్ లోని క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యూల్ నుంచి డేటా విజయవంతంగా డౌన్‌లోడ్ చేసినట్లు పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. విమానంలోని ఇంధన స్విచ్‌ల స్థానాన్ని పరిశీలిస్తున్నారు. వారు కనుగొనబడిన ఇంధన స్విచ్‌ల శిథిలాలతో డేటాను ధృవీకరించడానికి ప్రయత్నిస్తున్నారు. విమానంలో కీలకమైన దశలో పైలట్లు ప్రమాదవశాత్తూ ఏవైనా ఇంజిన్‌లను స్విచ్ ఆఫ్ చేశారో లేదో నిర్ధారించడంలో ఇది కీలకమైనది. డ్యూయల్ ఇంజన్ వైఫల్యం ప్రమాదానికి దారితీసిందా లేదా అనే దానిపై కూడా వారు దర్యాప్తు చేస్తున్నారు. ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానాల పైలట్‌లకు AI171 విషయంలో మాదిరిగా 400 అడుగుల కంటే తక్కువ ఎత్తులో డ్యూయల్ ఇంజన్ వైఫల్యాన్ని ఎదుర్కోవడానికి శిక్షణ తీసుకులేదు.





# మహారాష్ట్ర నవనిర్మాణ సేన ర్యాలీలో రాజకీయ యుద్ధం

- **మార్చ్ లో పాల్గొనేందుకు యత్నించిన మంత్రికి అవమానం**

**టీపీఎన్, థానే :**

మహారాష్ట్ర థానేలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహారాష్ట్ర నవనిర్మాణ సేన (MNS) నిర్వహించిన ర్యాలీపై రాజకీయ రగడ చెలరేగింది. శివసేన మంత్రి నిరసనలో పాల్గొనడానికి ప్రయత్నించడం ఉద్రిక్తతలకు దారి తీసింది. మంత్రి ప్రతాప్ సర్నాయక్‌ను తీవ్ర దుర్భాషలాడుతూ..థానేలోని నిరసన స్థలం నుండి బయటకు వెళ్ళమని బలవంతం చేశారు.

అగ్నికి ఆజ్యం పోసినట్టు మరాఠా భాషా వివాదం ఒకవైపు ముదురుతుంటే.. ఇలాంటి పరిస్థితుల్లో ఎంఎన్ఎస్ కార్యకర్తలు నిర్వహించిన నిరసన ఉద్రిక్తతలకు దారితీసింది.

మరాఠీ మాట్లాడనందుకు నిరాకరించినందుకు ఫుడ్ స్టాల్ యజమానిపై MNS కార్యకర్తలు దాడి చేశారు. దీనికి నిరసనగా వ్యాపారులు నిర్వహించిన ఆందోళనను తిప్పికొట్టేందుకు రాజ్ థాకరే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (MNS) కార్యకర్తలను థానేలోని మీరా రోడ్‌లో మార్చ్ నిర్వహించారు.


MNS కార్యకర్తలు వీధుల్లోకి రాగా, పోలీసులు వారిని పట్టుకుని పోలీసు వ్యాన్లలో ఎక్కించడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు ఎంఎన్ ఎస్ నిరసనకు అనుమతి ఇవ్వలేదు. స్లాప్‌గేట్ సంఘటనకు వ్యతిరేకంగా వ్యాపారులు నిరసన తెలిపేందుకు ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. తాము శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వస్తే అనుమతి ఇవ్వకుండా ఎందుకు అడ్డుకున్నారనిప్రశ్నించారు. మహారాష్ట్రలో నివసించే వారు మరాఠీ నేర్చుకోవాలని.. నేర్చుకోని వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు కార్యకర్తలు.

ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారనే ఆరోపణలను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తోసిపుచ్చారు. మహారాష్ట్రలో ప్రతి ఒక్కరికీ నిరసన ప్రదర్శన చేపట్టే హక్కు ఉంది. పోలీసుల అనుమతి తీసుకున్న తర్వాత ఎవరైనా చేయవచ్చు. ట్రాఫిక్ సమస్యలు, తొక్కిసలాట ప్రమాదాలు మొదలైనవి ఉన్నాయి. నిరసన తెలిపే మార్గాన్ని మార్చమని వారిని (ఎంఎన్ఎస్ నాయకులు) కోరినట్లు పోలీసు కమిషనర్ చెప్పారని తెలిపారు. కానీ వారు మొండిగా వ్యవహరించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారని అన్నారు.

భాషా వివాదం మధ్యలో ఆదివారం అర్థరాత్రి ఒక దుకాణదారుడిపై దాడి జరిగింది. మీరా రోడ్‌లో 'జోధ్‌పూర్ స్వీట్ షాప్' నడుపుతున్న 48 ఏళ్ల బాబులాల్ చౌదరిని ఏడుగురు MNS దుండగులు చెంపదెబ్బ కొట్టి బెదిరించారు, ఎందుకంటే అతని సిబ్బందితో హిందీలో మాట్లాడారు. MNS కార్మికులు శ్రీ చౌదరి ,శ్రీ భాగరామ్ మరాఠీలో మాట్లాడాలని డిమాండ్ చేశారు దుకాణ యజమాని రాష్ట్రంలో అన్ని భాషలు మాట్లాడతారని ఎత్తి చూపారు. ఈ దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది, ఇది మహారాష్ట్రలో భాషా చర్చను తిరిగి రేకెత్తించింది.

మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాల నేపథ్యంలో భాషా వివాదం కూడా కొనసాగుతోంది. విడిపోయిన బంధువులు ఉద్ధవ్ థాకరే ,ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ థాకరే తిరిగి కలిశారు 'స్లాప్‌గేట్' సంఘటనపై బిజెపి రాజకీయ దాడులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల పాఠ్యాంశాల్లో 'హిందీ'ని ప్రవేశపెట్టడంపై రాజకీయ వివాదం మరింత ముదిరింది.

"విభజించి పాలించు" విధానం ద్వారా బిజెపి రాజకీయ మైలేజ్ పొందేందుకు ప్రయత్నిస్తోందని ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. తాను ఏ భాషకూ వ్యతిరేకం కాదని, బలవంతంగా దాని రుద్దడాన్ని వ్యతిరేకిస్తాన్నారు. "విభజించి పాలించు అనేది ఎల్లప్పుడూ బిజెపి విధానం. ఈ తరహా రాజకీయాలు ఇప్పుడు దాని ఔచిత్యాన్ని కోల్పోతున్నాయి. శనివారం ముంబైలో జరిగిన మా ర్యాలీ విజయవంతం కావడంతో వారి పార్టీ అశాంతికి గురైనట్టు ఉందని అర్థం అవుతుందన్నారు.





# జమ్మూకాశ్మీర్ ఎల్జీపై డిప్యూటీ సీఎం ఆగ్రహం

**టీపీఎన్, జమ్మూకాశ్మీర్ :**

జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ పై తీవ్ర విమర్శలు చేశారు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం సురీందర్ చౌదరి. యూటీలో ధ్వంద అధికారాల అంశాన్ని లేవనెత్తారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ప్రజలకు తగినంత పనులు చేయలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి సంబంధించిన అధికారాలను నిర్వచించే లావాదేవీల వ్యాపార నియమాల (టిబిఆర్) కు సంబంధించిన ఫైల్‌ను ఎందుకు తిరిగి ఇవ్వడం లేదని ఎల్జీ సిన్హాను ప్రశ్నించారు. అధికారం చేపట్టిన ఎనిమిది నెలల తర్వాత కూడా యువతకు ఉద్యోగాలు కల్పించలేకపోతున్నామని బాధపడ్డారు.

దేశంలోని ఇతర ఎన్నికైన ప్రభుత్వాల మాదిరిగానే ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని జమ్మూ & కాశ్మీర్ ప్రభుత్వం యువత , వృద్ధుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకోవాలని అనుకుందని కానీ ద్వంద్వ కేంద్రపాలిత ప్రాంతం కావడంతో ద్వంద అధికారాల కారణంగా వాటిని చేయలేకపోయామని తెలిపారు. జమ్మూ నుండి సరిహద్దు రాజౌరి జిల్లాలోని సుందర్‌బానీ మీదుగా మారుమూల దద్దల్ కలసర గ్రామానికి వెళ్లే బస్సును చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అక్టోబర్‌లో బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ప్రజల సంక్షేమం కోసం లెఫ్టినెంట్ గవర్నర్ సహకరించడం లేదని చెప్పారు. డిప్యూటీ సీఎం వ్యాఖ్యలు రాజకీయ ప్రాముఖ్యతను సంతరించుకుంది.

2024 జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి రాష్ట్ర బిజెపి చీఫ్ రవీందర్ రాణాను ఓడించి జెయింట్ కిల్లర్‌గా అవతరించిన చౌదరి, రాష్ట్ర హోదా, విద్యుత్ పంపిణీ , ప్రత్యేక హోదా పునరుద్ధరణ వంటి అంశాలపై తీవ్ర స్వరంతో వ్యతిరేకించారు. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చిన కేంద్రం చర్యతో జమ్మూ, కాశ్మీరీ ప్రజలు సంతోషంగా లేరన్నారు డిప్యూటీ సీఎం.

డిప్యూటీ సీఎం అసెంబ్లీలో కూడా ఈ అంశాలను లేవనెత్తారు. బిజెపి ఎమ్మెల్యేల నిరసనల మధ్య ఆర్టికల్ 370 పునరుద్ధరణపై జమ్మూ కాశ్మీర్ ఎన్నికైన ప్రతినిధులతో చర్చలు జరపాలని కేంద్రాన్ని కోరుతూ సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు చౌదరి. జమ్మూ కాశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (జెకెఎఎస్) కు చెందిన 48 మంది అధికారులను బదిలీ చేయాలన్న ఎల్జి చర్య జెమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించిందని ఎన్సి నేతృత్వంలోని ప్రభుత్వం ఇటీవల ఆరోపించిన తర్వాత, ఏప్రిల్‌లో చౌదరి ఇంటి నుండే పాలక ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దని చివరిసారిగా ఢిల్లీని హెచ్చరించారు

# నాకు లగ్జరీ లైఫ్ అంటేనే ఇష్టం : కంగనా

- **రాజకీయ జీవితం నాకు సెట్ కాదు**

**టీపీఎన్, ముంబై :**

హిమాచల్ ప్రదేశ్ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు సభ్యురాలిగా తొలిసారిగా ఎన్నికైనందుకు తనకు ఆనందం లేదన్నారు. తాను చాలా 'స్వార్థపరురాలిని అని.. విలాసాలను ఆస్వాదిస్తానని, ప్రజాసేవ చేయడానికి తనకు అంతగా ఆసక్తి లేదని అన్నారు. తన రాజకీయ జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే ఆలోచన అస్సలు లేదని చెప్పారు. దేవుడు నన్ను ప్రధానమంత్రిని చేయడని ఆశిస్తున్నానని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

**ప్రధాని పదవిపై ఆశలేదు**

బిజెపి ఎంపీగా ఉన్న కాలంలో కంగనా పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండనందుకు ఆమెను పలుమార్లు మందలించారు అధిష్టానం పెద్దలు .సోషల్ మీడియాలో వ్యవసాయ చట్టాలపై ఆమె చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగింది. వెంటనే పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా తనకు ఫోన్ చేశారని చెప్పారు. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నానని తెలిపారు.

మీకు పెద్ద రాజకీయ ఆశయాలు ఉన్నాయా, ఉదాహరణకు ఒకరోజు ప్రధానమంత్రి కావడం వంటివి ఉన్నాయా అని అడిగినప్పుడు, అలా జరగకూడదని ప్రార్థిస్తున్నానని కంగనా చెప్పారు. నేను భారత ప్రధానమంత్రి కావడానికి సమర్థురాలిని అని నేను అనుకోను, ఆ కోరిక నాకు లేదు. సామాజిక సేవ చేయాలనే నేపథ్యం ఎప్పుడూ లేదు. నేను చాలా స్వార్థపూరిత జీవితాన్ని గడిపాను. నాకు పెద్ద ఇల్లు, పెద్ద కారు కావాలి, నాకు వజ్రాలు కావాలి. నేను అందంగా కనిపించాలనుకుంటున్నాను. నేను జీవించిన జీవితం అలాంటిది. ఇది నాకు ఒక రకమైన పుట్టుక. దేవుడు నన్ను ఏ ఉద్దేశ్యం కోసం ఎంచుకున్నాడో నాకు తెలియదు. కానీ నా జీవితాన్ని ఈ గొప్ప త్యాగంగా నేను చూడను... నాకు అలాంటి జీవితం ఇష్టం లేదు. నేను ఎవరిపైనా అలా కోరుకోను... నాలో అది లేదని తన మనస్సులో మాటను బయటపెట్టారు కంగనా.





# కోట్లు కూడబెట్టిన హర్యానా మాజీ ఐఏఎస్

**టీపీఎన్, హర్యానా :**

హర్యానాకు కేడర్ కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆస్తుల చిట్టా చూస్తూ ఎవ్వరైనా నోరు వెళ్లబెట్టాల్సిందే. తరతరాలకు సరిపడా ఆస్తులను కూడబెట్టారు. కోట్లు కొల్లగొట్టిన అవినీతి సొమ్ముతో లగ్జరీ లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు. రూ. 14.06 కోట్ల బ్యాంకు బ్యాలెన్స్, 2 పెద్ద ఇళ్ళు, 7 అపార్ట్‌మెంట్లను గుర్తించారు ఈడీ అధికారులు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద మురారి లాల్ తయాల్ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాత్కాలికంగా జప్తు చేసింది.

మురారీ మాయలు మాములుగా లేవు. ఆయన సంపాదించిన ఆస్తులు పలు రాష్ట్రాల్లో కోట్లు విలువ చేస్తాయి. వాటిలో చండీగఢ్ , న్యూఢిల్లీ, గుర్గావ్‌లలో రెండు ఇళ్ళు , ఏడు అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. పలు బ్యాంకుల్లో కోట్ల నగదును గుర్తించారు అధికారులు. జూన్ 30న ED అధికారులు ఆస్తులను అటాచ్ చేశారు. కానీ సోమవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో దీని గురించి అధికారిక ప్రకటన విడుదల చేశారు.

అప్పటి హర్యానా ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భూపిందర్ సింగ్ హుడాకు ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్నప్పుడు తయల్ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (CCI) సభ్యుడిగా ఉన్నాడు. 2005 మార్చి 6 నుంచి 2009 అక్టోబర్ 31 వరకు పనిచేశాడు. ఆ సమయంలో తాయల్ అక్రమంగా ఆస్తులు సంపాదించారనే ఆరోపణలతో ఆయనతోపాటు ఇతరులపై ఈడీ దర్యాప్తు చేస్తుంది. 2006 జనవరి 1 నుంచి 2014 డిసెంబర్ 31 వరకు తయాల్ తన ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టారని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది. తయల్, ఆయన భార్య సవితా తయల్, కుమారుడు కార్తీక్ తయల్ ల ఆర్థిక రికార్డులను, వారి ఆదాయపు పన్ను రిటర్నులు, ఇతర ఆర్థిక లావాదేవీలను ఈడీ దర్యాప్తు చేస్తోంది.


మనేసర్‌లో భూసేకరణకు సంబంధించిన అవకతవకలకు సంబంధించి సీబీఐ 2015 ఆగస్టు 12న మొదటి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దర్యాప్తు ఆధారంగా 2017లో తయాల్‌పై అతని ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి రెండో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సవితా తయల్ 2012లో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేసి, హర్యానా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (HPSC) సభ్యురాలిగా నియమితులయ్యారు. ఆమె 2016లో HPSC నుండి పదవీ విరమణ చేశారు.




# ట్రంప్‌నకు బ్రెజిల్ అధ్యక్షుడు వార్నింగ్

- **అమెరికా బెదిరింపులకు భయపడం**

**టీపీఎన్, బ్రెజిల్ :**



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ట్రంప్ బెదిరింపులకు భయపడేది లేదని చెప్పారు. తాటాకు చప్పుళ్లకు బెదిరిపోమని తెలిపారు. ట్రంప్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అంతర్జాతీయ వాణిజ్యం డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడానికి మార్గాలను అన్వేషిస్తున్నామని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికా అధ్యక్షుడు "సోషల్ మీడియాలో సుంకాలను సాకుగా చూపించి బెదిరించడం సరికాదని లూలా మండిపడ్డారు.

బ్రెజిల్ లోని వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం చివరి రోజు అనేక మలుపులు తిరిగింది. గంటల వ్యవధిలో ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రెండు పోస్ట్‌లను సెండ్ చేయడం సంచలనంగా మారింది. బ్రిక్స్ సమావేశానికి హాజరైన అనేక దేశాలు సుంకాలను ఎదుర్కోవాల్సిందేనని ట్రంప్ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. ప్రపంచంలో మంచి చేయాలని చూస్తున్న వారిపై ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నించే వారు ఎప్పటికీ శక్తివంతులు కాలేరని విమర్శించారు.

ప్రపంచ జనాభాలో 49% ప్రపంచ GDPలో 39% ప్రాతినిధ్యం వహిస్తున్నాయి BRICS దేశాలు. అందుకే ట్రంప్ వాటిని చూసి ఆందోళన చెందుతున్నట్టు కనిపిస్తోంది. డాలర్ కు ప్రత్యామ్నాంగా వేరే కరెన్సీ ఏమైనా అమల్లోకి తీసుకువస్తారా అని ట్రంప్ టెన్షన్ పడుతున్నట్టు కనిపిస్తోందని పరోక్షంగా విమర్శలు చేశారు. బ్రిక్స్ దేశాల నాయకులు యుద్ధం , శాంతి, వాణిజ్యం, ప్రపంచంలో పరిమాణాలు, ట్రంప్ సుంకాలపై చర్చించారు. పన్నుల తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోని పలు దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తతలపై చర్చించారు. ఇరాన్‌పై వైమానిక దాడులపై బ్రిక్స్ బృందం అమెరికా చర్యలను ఖండించింది. అమెరికన్ వ్యతిరేక విధానాలకు మద్దతిస్తే ఏ దేశానికైనా అదనంగా 10% టారిఫ్ లు విధిస్తామని ట్రంప్ బెదిరించారు.ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు.



# గాజా కాల్పుల విరమణపై ట్రంప్ ఉత్సాహం

- **ట్రంప్ కు నోబెల్ అర్హుడే:నెతన్యాహు**

**టీపీఎన్, వాషింగ్టన్ :**

ఖతార్‌లో ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరిగిన తాజా చర్చలలో ఎటువంటి పురోగతి లేనప్పటికీ, గాజా కాల్పుల విరమణ చర్చలు చాలా బాగా జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతోషం వ్యక్తం చేశారు. చర్చలతో ఎలాంటి ఫలితం కనిపించడం లేదు.

కాల్పుల విరమణపై ఈ వారంలో ఒప్పందం కుదుర్చుకోవాలని ట్రంప్ ఇటీవల ఇజ్రాయెల్ , హమాస్‌పై ఒత్తిడి పెంచారు. తాను అనుకున్నది కచ్చితంగా జరుగుతుందని నమ్మకంతో చెప్పారు.కానీ వాస్తవంలో మాత్రం అలా జరిగేలా కనిపించడం లేదు. వాషింగ్టన్ లో జరిగిన విందులో ట్రంప్ , నెతన్యాహులు పాలస్తీనియన్లను శాశ్వతంగా గాజా నుంచి తరలించడానికి ఈ ఏడాది ప్రారంభంలో సూచించిన ప్రతిపాదనల గురించి అడిగారు. ఇజ్రాయెల్ పొరుగు దేశాల నుండి దీనికి సహకారం ఉందని ట్రంప్ చెప్పగా..పాలస్తీనియన్లకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు USతో కలిసి పనిచేస్తున్నానని నెతన్యాహు చెప్పారు. ప్రజలు ఉండాలనుకునే వారు ఉంటారని.. వెళ్లిపోవాలనుకునే వారు వెళ్లిపోవచ్చని నెతన్యాహు సూచించారు. పాలస్తీనియన్లను గాజా నుండి బలవంతంగా బయటకు పంపాలనే ప్రతిపాదనలను UN, అరబ్ నాయకులు, మానవ హక్కుల సంస్థలు , పాశ్చాత్య ప్రభుత్వాలు ఖండించాయి. అరబ్ దేశాలు మాత్రం గాజాలో భారీ పునర్నిర్మాణంతో కూడిన ప్రత్యామ్నాయ ప్రణాళికను సూచించాయి.

ఆక్రమిత భూభాగంలోని ప్రజలను బహిష్కరించడం లేదా బలవంతంగా పంపించివేయడం అంతర్జాతీయ చట్టం ప్రకారం ఖచ్చితంగా నిషేధమని UN హెచ్చరించింది. ఇజ్రాయెల్ గాజా స్ట్రిప్‌పై ఎల్లప్పుడూ భద్రతా నియంత్రణ ఉంచుతుందని చెప్పారు. ఇజ్రాయెల్‌తో పాటు స్వతంత్ర పాలస్తీనా రాజ్యం అనే భావనకు అంతర్జాతీయ సమాజంలోని అధిక శాతం మద్దతు ఉంది. UN సభ్య దేశాలలో దాదాపు మూడు వంతులు అధికారికంగా పాలస్తీనా రాష్ట్రాన్ని గుర్తించాయి. ఇటీవల ఇజ్రాయెల్ రక్షణ మంత్రి మాట్లాడుతూ గాజాలోని 2 మిలియన్ల మంది పాలస్తీనియన్లను, హమాస్ కార్యకర్తలు కాదని నిర్ధారించుకోవడానికి వారిని పరీక్షించిన తర్వాత దక్షిణంలోని ఒక శిబిరానికి తరలించడానికి ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని సైన్యాన్ని ఆదేశించినట్లు చెప్పారు.

**యుద్ధాన్ని ముగించడంపై ట్రంప్ మాటలో..**

హమాస్ , ఇజ్రాయెల్ మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు జరిగినా ఎటువంటి పురోగతిని సాధించలేదని ఓ అధికారి చెప్పారు. మరోవైపు ట్రంప్ మాత్రం కాల్పుల విరమణను కోరుకుంటున్నాని తెలిపారు. వచ్చేవారంలో ఒప్పందంపై సంతకం చేస్తారో లేదా అనేది సస్పెన్స్ గా మారింది. హమాస్ ఆధ్వర్యంలోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం మధ్యాహ్నం గాజాలో గత 24 గంటల్లో ఇజ్రాయెల్ చేతిలో కనీసం 52 మంది పాలస్తీనియన్లు మరణించారని తెలిపింది. ప్రస్తుతం చర్చలో ఉన్న అమెరికా మద్దతుతో కూడిన కాల్పుల విరమణ ప్రతిపాదన ప్రకారం 60 రోజుల కాల్పుల విరమణ సమయంలో ఐదు దశల్లో హమాస్ 10 మంది బతికి ఉన్న బందీలను, 18 మంది చనిపోయిన బందీల మృతదేహాలను విడుదల చేయనుంది.

**ట్రంప్ కు నోబెల్**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేసినట్లు నెతన్యాహు చెప్పారు, ఇది అమెరికా అధ్యక్షుడి దీర్ఘకాల లక్ష్యం అని తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల మధ్య జరుగుతున్న అంతర్గత కుమ్ములాటలు, యుద్ధాలను అడ్డుకున్న ట్రంప్ కు నోబెల్ ఇవ్వాల్సిందేనని చెప్పారు.




# దుబాయ్ గోల్డెన్ వీసా కావాలా?

- **కేవలం రూ.23.30 లక్షలు చెల్లిస్తే చాలు**

టీపీఎన్, దుబాయ్ : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇటీవల ప్రవేశపెట్టిన నామినేషన్ ఆధారిత గోల్డెన్ వీసా చాలా ఆకర్షణీయంగా ఉంది. ఒకేసారి AED 1,00,000 (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిర్హామ్) సుమారు రూ. 23 లక్షల ఖర్చుతో భారతీయ పౌరులు ఇప్పుడు జీవితకాల నివాసాన్ని పొందగలుగుతారు. ఖరీదైన రియల్ ఎస్టేట్ కొనుగోలు చేయడం లేదా వ్యాపార వెంచర్లలో మూలధనాన్ని వెచ్చించాల్సిన అవసరం లేకుండా అక్కడి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇప్పుడు ఆ వీసా జారీ విషయంలో కొన్ని మార్పులు చేశారు.

**కొత్తరకం గోల్డెన్ వీసా**

యూఏఈ ప్రభుత్వం కొత్తరకం గోల్డెన్ వీసా పథకాన్ని ప్రారంభించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అందించే గోల్జెన్ వీసాకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉంటుంది.

దుబాయ్ గోల్డెన్ వీస్ పొందాలంటే, స్థిరాస్తిలో కనీసం రూ.20 లక్షలు ఏఈడీ ( భారత కరెన్సీలో రూ.4.66 కోట్లు ) లేదా వ్యాపారంలో పెద్ద మొత్తంలో పెట్టుబడి చేయాల్సి ఉండేది.

ఇప్పుడు అలాంటి నిబంధనలను ఎత్తివేసింది. దుబాయ్ గోల్జెన్ వీసా పొందాలంటే, నామినేషన్ ఆధారిత వీసా పథకం కింద, లక్ష ఏఈడీ ( దాదాపు రూ.23.30 లక్షలు) ఫీజు ద్వారా చెల్లించడం ద్వారా లైఫ్ టైమ్ గోల్డెన్ వీసాను పొందవచ్చు

**ఎలా దరఖాస్తు చేసుకోవచ్చు.**

గోల్డెన్ వీసా దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు... పాస్‌పోర్ట్, ఎడ్యుకేషన్ లేదా ప్రొఫెషన్ , ఆదాయం లేదా పెట్టుబడి , అక్రిడిటేషన్ లేదా సర్వీస్ లెటర్స్ డాక్యుమెంట్స్ సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునేందుకు ఫీజు AED 2,800 నుండి AED 4,000 వరకు ఉంటుంది. రాబోయే మూడు నెలల్లో 5 వేల మంది భారతీయులు దుబాయ్ గోల్డెన్ వీసా కోసం అప్లై చేసుకునే ఛాన్స్ ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**విదేశాలకు మకాం మారుస్తున్న మిలియనీర్లు**

హెన్లీ ప్రైవేట్ వెల్త్ మైగ్రేషన్ రిపోర్ట్ 2024 అంచనా ప్రకారం 2023లో 5,100 మంది భారతీయ మిలియనీర్లు విదేశాల్లో సెటిల్ అయ్యారని తెలిపింది. ఈ ఏడాది 4,300 మందికి పైగా భారతీయ మిలియనీర్లు విదేశాలకు మకాం మార్చే అవకాశం ఉంది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పార్లమెంటులో సమర్పించిన డేటా ప్రకారం, 2011 నుండి 1.6 మిలియన్లకు పైగా భారతీయులు అధికారికంగా విదేశాల్లో సెటిల్ అయ్యారని తెలిపింది.

# టెక్సాస్‌లో వరద విలయం

**టీపీఎన్, టెక్సాస్ :**

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో వనాలు, వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. కుండపోత వర్షాలతో నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కనుచూపు మేర ఎటుచూసినా వరద నీరే కనిపిస్తోంది. కొన్ని గంటల్లోనే రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు అయ్యింది. కొన్ని నెలలకు సరిపడా వర్షం కురిసిందంటే దాని తీవ్రత ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక అధికారులు 100 ఏళ్లలో ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని చెబుతున్నారు. టెక్సాస్ లో భారీ వర్షాలకు 100 మందికిపైగా చనిపోయినట్టు నిర్ధారించారు. మరికొంత మంది గల్లంతయ్యారు. వారికి కోసం గాలింపు ముమ్మరం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**టెక్సాస్ వరదలకు మూడు కారణాలు**

ఈ భయంకరమైన వరదలకు ప్రధానంగా మూడు కారణాలు చూపిస్తున్నారు. మెక్సికోలో వర్షాలు, వరదలకు వాతావరణంలో మార్పులు, గాలిలో తేమ ఎక్కువగా ఉండటంతో క్లౌడ్ బరస్ట్ మాదిరిగా నిమిషాల వ్యవధిలోనే కుండపోత వానలు పడ్డాయి. రాబోయే రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు వాతావరణశాఖ అధికారులు. రాత్రి సమయంలో సెల్ ఫోన్లకు హెచ్చరిక మెసేజ్ లు పంపిస్తున్నామని తెలిపారు. భూమి వేడెక్కుతున్నా కొద్దీ వాతారణంలో అనూహ్య మార్పులు సంభిస్తున్నాయని ..అందుకే అధిక వర్షాలు కురుస్తున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.






# ఆఖర్లో కొనుగోళ్లు.. ఓ మోస్తరు లాభాలు!

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మోస్తరుగా లాభపడ్డాయి. ఆరంభం నుంచీ రేంజుబౌండ్లోనే కదలాడాయి. అయితే ఆఖర్లో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగడంతో కొంతమేర పెరిగాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు రావడం, అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడం, ఇతర దేశాలపై డొనాల్డ్ ట్రంప్ 26% సుంకాలు విధించడమే ఇందుకు కారణాలు. నేటి రాత్రి మినీ డీల్‌పై స్పష్టత రావొచ్చన సూచనలతో ఆఖర్లో పాజిటివ్ సెంటిమెంటు పెరిగింది. మొత్తంగా నిఫ్టీ 61, సెన్సెక్స్ 270 పాయింట్ల మేర లాభపడ్డాయి.

క్రితం సెషన్లో 83,442 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ మంగళవారం 83,387 వద్ద మొదలైంది. 83,320 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 83,812 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 270 పాయింట్ల లాభంతో 83,712 వద్ద ముగిసింది. 25,427 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,424 వద్ద కనిష్ఠ, 25,548 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 61 పాయింట్ల లాభంతో 25,522 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 307 పాయింట్లు పతనమై 57,256 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ50లో 28 కంపెనీలు లాభపడగా 22 నష్టపోయాయి. కొటక్ బ్యాంకు, ఎటర్నల్, ఏసియన్ పెయింట్స్, గ్రాసిమ్, ఎన్టీపీసీ టాప్ గెయినర్స్. టైటాన్, డాక్టర్ రెడ్డీస్, సిప్లా, బజాజ్ ఆటో, ట్రెంట్ ఎక్కువ నష్టపోయాయి. నేడు రియాల్టి, సీపీఎస్ఈ, పీఎస్ఈ, ఫైనాన్స్, ప్రైవేటు బ్యాంకు, బ్యాంకు, కమోడిటీస్, ఇన్ఫ్రా, ఎనర్జీ, చమురు సూచీలు ఎగిశాయి. కన్జూమర్ డ్యురబుల్స్, ఫార్మా, హెల్త్‌కేర్, ఆటో, కన్జంప్షన్, తయారీ, ఎంఎన్‌సీ, పీఎస్‌యూ బ్యాంకు సూచీలు ఎరుపెక్కాయి.

ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ సెల్లర్లకే అనుకూలంగా ఉంది. మొత్తం 3024 స్టాక్స్ ట్రేడవ్వగా 1352 లాభపడ్డాయి. 1564 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 56 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 40 తాకాయి. అప్పర్ సర్క్యూటును 86, లోయర్ సర్క్యూటును 62 చేరాయి.

డాలరుతో పోలిస్తే రూపాయి 0.2శాతం పెరిగి 85.69 వద్ద స్థిరపడింది. జేన్ స్ట్రీటుపై సెబీ ఆంక్షల నేపథ్యంలో బీఎస్ఈ షేర్లు 13% మేర పతనమయ్యాయి. రెండోరోజు మధ్యాహ్నానికి ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ ఐపీవోకు 22% స్పందన లభించింది. చివరి నాలుగేళ్లలో డెరివేటివ్స్ విభాగంలో రిటైల్ ట్రేడర్స్ రూ.2.87లక్షల కోట్లు నష్టపోయారని సెబీ తెలిపింది. 10.5% వరకు యీల్డు రేటుతో ఎడిల్‌వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.300 కోట్ల విలువైన ఎన్‌సీడీ ఇష్యూ ఆరంభించింది. రూ.1200 కోట్లతో ఇండోర్లో 450 ఎకరాల్లో ఒమాక్స్ భారీ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తోంది. సెంట్రల్ వేర్‌హౌస్ కార్పొరేషన్‌కు సంబంధించి రైల్‌టెల్ రూ.97 కోట్ల లెటర్ ఆఫ్ ఇంటెంట్ పొందింది.

మూర్తి నాయుడు పాదం
నిఫ్ట్ మాస్టర్
స్టాక్ మార్కెట్ అనలిస్ట్
+91 988 555 9709




## విదర్భ ఇండస్ట్రీస్ పవర్‌ను సొంతం చేసుకున్న అదానీ పవర్

- **2030 నాటికి 30,670 మెగావాట్ల సామర్థ్యం లక్ష్యం**

**టీపీఎన్, ముంబై :**

అదానీ పవర్ లిమిటెడ్ (APL) విదర్భ ఇండస్ట్రీస్ పవర్ లిమిటెడ్ (VIPL)ను ₹4,000 కోట్లకు సొంతం చేసుకుని, తన బేస్‌లోడ్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో ముఖ్యమైన అడుగు వేసింది. ఈ సముపార్జనను APL మంగళవారం ఉదయం ధృవీకరించింది. జూన్ 18, 2025న ముంబై బెంచ్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (NCLT) ఆమోదం తర్వాత, జూలై 7న ఈ సముపార్జన అమలు పూర్తయింది.

మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లా బుటిబోరిలో 2×300 మెగావాట్ల కోల్‌ఫైర్డ్ పవర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్న VIPL, ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీ కోడ్ (IBC) కింద కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ (CIRP)లో ఉంది.

ఈ సముపార్జనతో అదానీ పవర్ యొక్క మొత్తం కార్యాచరణ సామర్థ్యం ఇప్పుడు 18,150 మెగావాట్లకు చేరింది. నిర్వహణలో లోపాలున్న లేదా ఒత్తిడిలో ఉన్న ఆస్తులను ఉత్పాదక విద్యుత్ జనరేటర్లుగా మార్చడం తమ లక్ష్యంతో ఈ సముపార్జన సరిపోతుందని కంపెనీ పేర్కొంది.

"ఒత్తిడిలో ఉన్న ఆస్తుల పునరుద్ధరణ ద్వారా విలువను సృష్టించే మా ప్రయాణంలో ఈ సముపార్జన కీలక మైలురాయి," అని అదానీ పవర్ లిమిటెడ్ సీఈఓ ఎస్‌బీ ఖ్యాలియా అన్నారు. "మా పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తున్నప్పుడు, 'అందరికీ విద్యుత్' అనే భారతదేశ విజన్‌కు మద్దతు ఇస్తూ, స్థిరమైన అభివృద్ధికి నమ్మకమైన, సరసమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాము."

APL బ్రౌన్‌ఫీల్డ్ అప్‌గ్రేడ్‌లు మరియు గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి ద్వారా దూకుడుగా విస్తరిస్తోంది. ప్రస్తుతం కంపెనీ మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ఆరు 1,600 మెగావాట్ల అల్ట్రాసూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లను, ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఒక గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్‌ను నిర్మిస్తోంది. అదనంగా, ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బాలో 1,320 మెగావాట్ల సూపర్‌క్రిటికల్ పవర్ ప్లాంట్‌ను పునరుద్ధరిస్తోంది.

2030 నాటికి అదానీ పవర్ 30,670 మెగావాట్ల కార్యాచరణ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది, దీనితో భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ బేస్‌లోడ్ విద్యుత్ ఉత్పత్తి కంపెనీగా స్థానం పొందనుంది.




## WNSను సొంతం చేసుకున్న క్యాప్‌జెమినీ

**టీపీఎన్, పారిస్/ ముంబై :**

క్యాప్‌జెమినీ భారత సంతతికి చెందిన బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (BPM) సంస్థ WNSను $3.3 బిలియన్ల నగదుకు సొంతం చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ చర్య గ్లోబల్ కన్సల్టింగ్ మరియు టెక్ సర్వీసెస్ రంగంలో సంచలనం సృష్టించవచ్చని, ముఖ్యంగా బిగ్ 4 — డెలాయిట్, PwC, EY, మరియు KPMG — ఆధిపత్యానికి సవాలు విసరవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

ఈ ఒప్పందం రెండు సంస్థల బోర్డుల ఏకగ్రీవ ఆమోదంతో 2025 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. క్యాప్‌జెమినీ NYSEలో లిస్ట్ అయిన WNSకు షేరుకు $76.50 చెల్లిస్తుంది, ఇది దాని 90రోజుల సగటు షేరు ధర కంటే 28% ప్రీమియం.

పరిశ్రమ నిపుణులు ఈ సముపార్జన టెక్ మరియు BPM రంగాలలో కొత్త ఏకీకరణ తరంగానికి నాంది పలికవచ్చని, ముఖ్యంగా సంస్థలు కృత్రిమ మేధస్సు (AI) యొక్క విస్తృత ప్రభావానికి సిద్ధమవుతున్నాయని అంటున్నారు. "ఇది బిగ్ 4తో పోటీపడడంలో క్యాప్‌జెమినీకి శక్తివంతమైన కొత్త స్థానాన్ని ఇస్తుంది," అని HFS రీసెర్చ్ CEO ఫిల్ ఫెర్ష్ట్ అన్నారు. "WNS ఏకీకరణ AIనడిచే పరివర్తన నుంచి ఉద్భవిస్తున్న $1.5 ట్రిలియన్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని సర్వీసెస్‌ఆస్‌సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అభివృద్ధి చేయడానికి ఆదర్శవంతమైన వేదికను సృష్టించవచ్చు."

ఎవరెస్ట్ గ్రూప్ వ్యవస్థాపకుడు పీటర్ బెండోర్‌సామ్యూల్ ఈ చర్యను "క్యాప్‌జెమినీ యొక్క సముపార్జననడిచే వృద్ధి మోడల్‌కు తిరిగి రాక" అని పిలిచారు మరియు ఇది పరిశ్రమ అంతటా వ్యూహాత్మక విలీనాలు మరియు సముపార్జనల గొలుసు ప్రతిచర్యను ప్రేరేపించవచ్చని అన్నారు. WNS లోతైన డొమైన్ నైపుణ్యం, ఉత్తర అమెరికా మరియు UKలో బలమైన క్లయింట్ బేస్, మరియు 2017లో డెనాలి సముపార్జన నుంచి వచ్చిన వ్యూహాత్మక సోర్సింగ్ సామర్థ్యాలను తీసుకువస్తుంది. క్యాప్‌జెమినీ ఇప్పుడు సాంప్రదాయ ఆటగాళ్ల కంటే తక్కువ ధరల వద్ద ఎండ్‌టుఎండ్ పరివర్తన సేవలను అందించగలదని విశ్లేషకులు అంటున్నారు.

క్యాప్‌జెమినీ CEO ఐమాన్ ఎజ్జత్ ఈ ఒప్పందం AIశక్తితో కూడిన "ఇంటెలిజెంట్ ఆపరేషన్స్"లో గ్రూప్‌ను నాయకత్వం వహించేలా చేస్తుందని, అయితే WNS CEO కేశవ్ ఆర్. మురుగేష్ సంస్థలు ఇప్పుడు "ఆటోమేషన్ నుంచి ఆటోనమీకి" AIని కేంద్రంగా చేరుతున్నాయని అన్నారు.

## FY25లో 41% పెరిగిన వ్యక్తిగత ట్రేడర్ల నష్టాలు

**టీపీఎన్, ముంబై :**

భారతదేశ ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్ (EDS)లో వ్యక్తిగత ట్రేడర్లు FY25లో భారీగా ₹1.06 లక్షల కోట్ల నికర నష్టాన్ని చవిచూశారని, ఇది FY24లో ఉన్న ₹74,812 కోట్లతో పోలిస్తే 41% పెరుగుదలను సూచిస్తుందని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఇటీవలి అధ్యయనం వెల్లడించింది.

డిసెంబర్ 2024 నుంచి మే 2025 వరకు ట్రేడింగ్ కార్యకలాపాలను విశ్లేషించిన ఈ అధ్యయనం, మొత్తం మార్కెట్‌లో సుమారు 107 లక్షల ట్రేడర్లలో, EDSలో 96 లక్షల మంది విశిష్ట ట్రేడర్లను సిబ్బంది 13 ప్రముఖ స్టాక్ బ్రోకర్ల డేటా ఆధారంగా పరిశీలించింది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (F&O) ట్రేడింగ్ రిటైల్ ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆదరణ ఉన్నప్పటికీ, సెబీ అధ్యయనం ప్రకారం చాలా మంది పాల్గొనేవారికి రిస్కులు రివార్డులను అధిగమిస్తున్నాయి. FY25లో ఆశ్చర్యకరంగా 91% వ్యక్తిగత ట్రేడర్లు నికర నష్టాలను నమోదు చేశారు, ఇది మునుపటి ఆర్థిక సంవత్సరంతో దాదాపు మార్పు లేని శాతం.

"వ్యక్తిగత ట్రేడర్ల నికర నష్టాలు 41% పెరిగి, ట్రాన్సాక్షన్ ఖర్చులను కూడా లెక్కించిన తర్వాత FY25లో ₹1,05,603 కోట్లకు చేరాయని అధ్యయనం సూచిస్తుంది," అని సెబీ పేర్కొంది.

సామాజిక మాధ్యమ ట్రెండ్‌లు, త్వరిత లాభాల మాయలో ఊగిసలాడే అనుభవం లేని రిటైల్ ఇన్వెస్టర్ల ఊహాగాన ట్రేడింగ్‌లో వేగవంతమైన పెరుగుదలపై పెరుగుతున్న ఆందోళనల నడుమ ఈ తాజా డేటా వెలుగులోకి వచ్చింది. డెరివేటివ్ మార్కెట్‌లు హెడ్జింగ్ మరియు రిస్క్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైనవి అయినప్పటికీ, తగిన జ్ఞానం లేదా మూలధనం లేని వ్యక్తిగత ఇన్వెస్టర్లకు గణనీయమైన రిస్కులను కలిగి ఉన్నాయని సెబీ నిరంతరం హెచ్చరిస్తోంది.

ఈ ఫలితాలు అధికరిస్క్ F&O ట్రేడింగ్‌లో అతిగా రిటైల్ పాల్గొనడాన్ని అరికట్టడంపై జరుగుతున్న నియంత్రణ చర్చలకు తక్షణ ప్రాధాన్యతను జోడించనున్నాయి. సెబీ కఠినమైన రిస్క్ డిస్క్లోజర్‌లు, అధిక మార్జిన్‌లు, ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుంటూ చిన్న ఇన్వెస్టర్లను డెరివేటివ్స్ స్పేస్‌లో అస్థిర నష్టాల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవచ్చని తెలుస్తోంది.







## భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం?

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

భారతదేశం అమెరికాతో వాణిజ్య మంగళవారం నాటికి ఖరారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ప్రస్తుత ఒప్పంద నిబంధనలు భారత్ ఆశించిన స్థాయికి సరిపడకపోతే ఈ గడువు ఆగస్టు 1 వరకు పొడిగించవచ్చని సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఏప్రిల్ 2 సుంకాల ప్రణాళిక—'లిబరేషన్ డే' సుంకాలు అని పిలవబడే—పై 90 రోజుల విరామాన్ని ప్రకటించారు, ఇది కొన్ని దిగుమతులపై 40% వరకు సుంకాలను విధించింది. ఒప్పందం లేకపోతే, జూలై 8 అర్ధరాత్రి విరామం ముగిసిన తర్వాత భారత ఎగుమతులపై సుమారు 26% సుంకాలు విధించబడవచ్చు.


అయితే, జాతీయ ప్రయోజనాలకు సరిపడని ఒప్పందంలోకి తొందరపడమని భారత అధికారులు తెలిపారు. "మేము ఇప్పటికీ జూలై 8 గడువులో పనిచేస్తున్నాము," అని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి అన్నారు, "కానీ నిబంధనలు సరిపడకపోతే, ఆగస్టు 1 వరకు పొడిగించిన కాలపరిమితి ఉపయోగించవచ్చు." గమనస్వరూపంగా, అమెరికా నుంచి అధికారిక సుంక హెచ్చరిక లేఖలు అందుకున్న 14 దేశాల జాబితాలో భారత్ లేదు.

అధ్యక్షుడు ట్రంప్ భారత్‌తో చర్చలు కొనసాగుతున్నాయని ధృవీకరిస్తూ, "మేము భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి దగ్గరలో ఉన్నాము," అని అన్నారు. యూకే మరియు చైనాతో ఒప్పందాలు కుదిరినప్పటికీ, చర్చలు విఫలమైతే ఇతర దేశాలపై సుంకాలు విధించవచ్చని ఆయన జోడించారు.

భారత్‌తో ఒక చిన్న వాణిజ్య ఒప్పందం కొన్ని నెలలుగా చర్చలో ఉంది. స్పెషల్ సెక్రటరీ రాజేష్ అగర్వాల్ నేతృత్వంలోని భారత చర్చకుల బృందం ఇటీవల అమెరికా నుంచి తిరిగ విజయవంతంగా తిరిగి వచ్చి, భారత్ యొక్క తుది ప్రతిపాదనలను సమర్పించింది. భారత్ తన స్థానాన్ని మరింత సవరించదని భావిస్తున్నారు.

ప్రధాన అంశాలు ఇంకా అడ్డంకిగా ఉన్నాయి: అమెరికా జన్యుపరంగా సవరించిన (GM) ఉత్పత్తులైన సోయాబీన్ మీల్ మరియు DDGS, అలాగే అమెరికా ఆవు పాల దిగుమతులను అనుమతించాలని కోరుకుంటోంది, ఇవి భారత్ ప్రజారోగ్యం మరియు దేశీయ సున్నితత్వాల కారణంగా చారిత్రాత్మకంగా వ్యతిరేకించింది.

ఈరాత్రి ఒప్పందం కుదిరినా లేదా వాయిదా ఉన్నా, భారతదేశం తన ప్రధాన ప్రయోజనాలను రక్షించుకోవడంలో దృఢంగా ఉంది.





# ఇదేం టాలెంట్ బ్రో.. జుగాడ్ బాప్‌కే బాప్ లా ఉందే..

అబ్బాయిలకి కార్లంటే పిచ్చి అనే విషయం చాలా మందికి తెలుసు. కొంతమంది తమకు నచ్చిన కార్ ని కొనేయాలని చాలా కష్టపడుతుంటారు. కానీ మరి కొంతమంది స్టార్స్ అయితే చాలా ఈజ్ తో తమ ఫేవరెట్ కార్లను కొనేస్తారు. కానీ కాస్ట్లీ స్పోర్ట్స్ కారు కొనడానికి మీ దగ్గర డబ్బు లేకపోతే ఏమీ జరుగుతుందో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? బిబిన్ అనే వ్యక్తి దానికి సొల్యూషన్ కనుగొన్నాడు. కేరళకు చెందిన ఈ మెకానిక్ లగ్జరీ కార్ లంబోర్గిని దేశీ వెర్షన్‌ను తయారు చేసి నెటిజన్స్ ను సర్ ప్రైజ్ చేశారు. అతడు తయారు చేసిన అద్భుతమైన కారుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియా షేక్ చేస్తుంది. ఈ అల్టిమేట్ క్రేజీ ప్రాజెక్ట్ లో తాను దాదాపు మూడు సంవత్సరాల క్రితం పనిచేయడం ప్రారంభించానని బిబిన్ చెప్పాడు. లంబోర్గిని దేశీ వెర్షన్ ను ప్రొడక్ట్ ను స్టార్ట్ చేయడానికి బిబిన్ స్క్రాప్ మెటీరియల్‌ను ఉపయోగించాడు. అవును, మీరు విన్నది నిజమే. అతను సమీపంలోని స్క్రాప్ యార్డ్ నుండి జంక్ పార్ట్‌లను, లోకల్ గా దొరికే హార్డ్‌వేర్ షాప్స్ నుండి ఇతర వస్తువులను కలెక్ట్ చేసి మరీ ఈ కారును తయారు చేశాడు. ఇది మీకు వింతగా అనిపించవచ్చు, కానీ అతను కారుకు నిజమైన లంబోర్గిని లుక్ ఇవ్వడానికి దాని బయటి బాడీపై కార్డ్ బోర్డ్ ను కూడా ఉపయోగించాడు. దీనితో పాటు, అతను మెటల్ పైపులు, ఫైబర్‌గ్లాస్ వంటి పదార్థాలను ఉపయోగించి తన బడ్జెట్‌ను కూడా నియంత్రణలో ఉంచుకున్నాడు. ఒక కంపెనీలో నాణ్యత హామీ విభాగంలో పనిచేసే బిబిన్, పరిమిత నిధులు, సమయం లేకపోవడం వల్ల తాను కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నానని, కానీ కారును తయారు చేయడం మాత్రం వదులుకోలేదని చెప్పాడు. తన దేశీ వెర్షన్ లంబోర్గిని పనిని ఇప్పటివరకు 80% పూర్తి చేశాడని, దానికోసం దాదాపు ఒకటిన్నర లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పుకొచ్చాడు. అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, లంబోర్గిని చక్రాలు బడ్జెట్ లో లేవు. దీంతో బిబిన్ తన లగ్జరీ కారుకు లోకల్ చక్రాల్ని యాడ్ చేయాలని డిసైడ్ చేసుకున్నాడు. దీని కోసం చాలా డీటైలింగ్ తో మారుతి ఆల్టో చక్రాలను ఉపయోగించాడు. ఇది మాత్రమే కాదు, అతను మొత్తం కారును చక్రాల పరిమాణానికి అనుగుణంగా తిరిగి డిజైన్ చేశాడు. సోషల్ మీడియా వినియోగదారులు మెకానిక్ తన కలను నెరవేర్చుకోవడానికి చేసిన కృషిని, కమిట్‌మెంట్ ను ప్రశంసిస్తున్నారు. యూట్యూబర్ అరుణ్ స్మోకీ బిబిన్‌ను ఇంటర్వ్యూ చేశాడు. అతని స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా వేలాది మందికి చేరుకుంది. దీంతో నెటిజన్స్ ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు. బిబిన్ టాలెంటెడ్ మాత్రమే కాదు, అతని అంకితభావం కూడా ప్రశంసనీయం అని పోస్టులు పెడుతున్నారు. దీంతో పాటు బిబిన్ చేసిన ఈ కార్ మాత్రం తెగ వైరల్ అయిపోతుంది.




# వామ్మో.. బతికి ఉన్న బొద్దింకని ఏం చేసిందంటే?

ప్రతిరోజూ సోషల్ మీడియాలో మనకి బోలెడన్నీ వైరల్ వీడియోలు కనిపిస్తూ ఉంటాయి. వీటిల్లో ఎక్కువగా ఫన్ క్రియేట్ చేసే వీడియోలు, అలాగే కొన్ని రకాలుగా జంతువులకు సంబంధించిన వీడియోలు ఎక్కువగా వైరల్ అవుతూ ఉంటాయి. కొందరు ప్రజలు చేసే వింత పనుల వల్ల కూడా కొన్ని వీడియోలు వైరల్ అవుతుండడం ప్రతిరోజు గమనిస్తూనే ఉంటాము. గతంలో కూడా చాలా రకాల యానిమల్ రిలేటెడ్ వీడియోలు వైరల్ అవ్వడం.. మనం షాక్ తో పాటు సర్ ప్రైజ్ అవ్వడం చూస్తూనే ఉంటాం. అలాంటి ఓ వీడియో లేటెస్ట్ గా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. నిజానికి చాలామంది బొద్దింకను చూడగానే అదేదో.. పులులను చూసినట్లుగా తెగ భయపడిపోతారు. ముఖ్యంగా అమ్మాయిలు అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇది ఇలా ఉండగా.. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలో ఘటన చూస్తే నోట మాట రాదు. ఎందుకంటే, ఓ మహిళ ఓ రెస్టారెంట్లో బర్గర్ తింటూ ఉంటుంది. అలా ఆమె ప్రశాంతగా కూర్చొని బర్గర్ తింటున్న సమయంలో ఆమె కూర్చున్న టేబుల్ పై బొద్దింక అటుగా పాకుతూ వెళ్తోంది. సరిగ్గా ఆమె తింటున్న ప్లేట్ పక్కకు వచ్చి ఆగిపోతుంది. అది గమనించిన ఆ అమ్మాయి అస్సలు లేట్ చేయకుండా ఆ బతికి ఉన్న బొద్దింకను ఓ చేత్తో పట్టుకొని దానిని ఆ బర్గర్ లో పెట్టింది. అంతటితో ఊరుకుందా అంటే లేదు. ఆ బర్గర్ ను ఏదో నాన్ వెజ్ బర్గర్ అనుకొని అమాంతం తినడం మొదలుపెట్టేసింది. ఈ వీడియోని చూసిన నెటిజన్స్ సోషల్ మీడియాలో తెగ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఓరి దేవుడా ఇటువంటి అమ్మాయిలు కూడా ఉన్నారా..? అంటూ కొందరు కామెంట్ చేస్తుండగా.. మరి కొందరేమో ఇది మనకు కొత్తగా అనిపించవచ్చు.. కొన్నిదేశాల్లో ఇది కామన్ అంటూ మరికొందరు కామెంట్ చేస్తున్నారు. మరికొందరేమో నాకు ఈ వీడియో చూసిన వెంటనే వాంతులు అయ్యాయి అని కామెంట్ చేశారు. అయితే, ఈ వీడియో నిజంగా జరిగిందా? లేదా ఎడిట్ చేశారా? అనేది క్లియర్ గా తెలియకపోయినా.. చూడటానికి మాత్రం చాలా ఇబ్బందిగా ఉంది. కానీ నెటిజన్స్ విషయంలో వైరల్ చేయడంలో మాత్రం ఫుల్ గా సక్సెస్ అయ్యింది. ఇక నెటిజన్లు ఎవరి స్టైల్ లో వాళ్లు రెస్పాన్డ్ అవుతున్నారనుకోండి. ఏది ఏమైనా ఇలా బ్రతికే ఉన్న పురుగుల్ని, బొద్దింకల్ని అలా తినే ఫుడ్ లో పెట్టుకుని మరీ తినాలంటే కాస్త సాహసమే. లేదా ఇలా ఏదైనా వైరల్ అవ్వాలనుకునే ఇంటెన్షన్ ఉన్నప్పుడు ట్రై చేస్తున్నవాళ్లు కూడా రీసెంట్ టైమ్ లో చాలా మంది కనిపిస్తున్నారు కాబట్టి ఇంకా ఇలాంటి వాటికి ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదులే అంటూ లైట్ చేసుకుని.. వీడియోని ఎంజాయ్ చేస్తున్నవాళ్లు కూడా ఉన్నారు. అందులోనూ ఈ మధ్యకాలంలో రీల్స్ కోసం, వ్యూస్ కోసం ప్రాణాల్ని కూడా లెక్కచేయని వాళ్లు చాలామందే ఉన్నారు.

# వన్ ప్లస్ బంపర్ ఆఫర్.. ఏకంగా 6 ఇయర్స్ అప్డేట్స్



మోస్ట్ పాపులర్ మొబైల్ కంపెనీ వన్‌ప్లస్ ఒకేరోజు రెండు ఫోన్లను లాంచ్ చేసి యూజర్స్ ని సర్ ప్రైజ్ చేసింది. వన్ ప్లస్ నార్డ్ 5 అండ్ నార్డ్ సీఈ 5 పేరుతో మిడ్‌రేంజ్ ఫోన్లను తీసుకొచ్చింది. బిగ్ బ్యాటరీ, 80W ఫాస్ట్ ఛార్జింగ్ ఫెసిలిటీస్ ఇందులో ఉన్నాయి. నాలుగు ఆండ్రాయిడ్ అప్డేట్స్ తో పాటు, ఆరేళ్ల సెక్యూరిటీ అప్డేట్స్ తో ఈ ఫోన్లను తీసుకురావడం హైలెట్. ఈ రెండు ఫోన్లలోనూ ఏఐ ఫీచర్లను యాడ్ చేశారు. అలర్ట్ స్లయిడర్ ప్లేస్ లో కొత్తగా ఇందులో ప్లస్ కీ ని అమర్చారు. వీటితో పాటు వన్‌ప్లస్ బడ్స్ 4ని కూడా కంపెనీ లాంచ్ చేసింది. వన్‌ప్లస్ నార్డ్ 5లో 6.83 అంగుళాల అమోలెడ్ 1.5K, 144 Hz డిస్‌ప్లే ఇచ్చారు. స్నాప్ డ్రాగన్ 8ఎస్ జన్ 3 ప్రాసెసర్ ను అమర్చారు. వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 700 మెయిన్ కెమెరా ఇచ్చారు. ఇది ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ తో వస్తోంది. దీంతో పాటు 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. 50 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6,800 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 80W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఆక్సిజన్ ఓఎస్ 15తో పనిచేస్తుంది. వైఫై 6, ఎన్ఎఫ్‌సీ, ఇన్ డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సర్, ఐఆర్ ట్రాన్స్‌మిటర్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. ఐపీ 65 రేటింగ్‌తో వస్తున్న ఈ ఫోన్ బరువు 211 గ్రాములు. వన్‌ప్లస్ నార్డ్ సీఈ5లోనూ 6.83 అంగుళాల అమోలెడ్ 1.5k, 144 Hz డిస్‌ప్లేను ఇచ్చారు. ఇందులో మీడియాటెక్ డైమెన్‌సిటీ 8350 ప్రాసెసర్‌ను అమర్చారు. వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 600 ప్రధాన కెమెరా ఇచ్చారు. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. సెల్ఫీల కోసం 16 ఎంపీ కెమెరా ఉంది. ఇందులో 7,100 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. ఇది కూడా 80W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఆక్సిజన్ ఓఎస్ 15తో పనిచేస్తుంది. ఇందులోనూ ఇన్‌డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సర్, ఐఆర్ ట్రాన్స్‌మిటర్ ఉన్నాయి. దీని బరువు 199 గ్రాములు. వన్‌ప్లస్ నార్డ్ 5 మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ+ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర రూ.31,999 కాగా.. 12జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.34,999, 12జీబీ+ 512జీబీ వేరియంట్ ధర రూ.37,999గా కంపెనీ నిర్ణయించింది. నార్డ్ 5 డ్రై ఐస్, మార్బుల్ సాండ్, ఫాంటమ్ గ్రే రంగుల్లో లభిస్తుంది. జులై 9 నుంచి విక్రయానికి రానుంది. ఇక వన్‌ప్లస్ సీఈ 5 కూడా మూడు వేరియంట్లలో లభిస్తోంది. 8 జీబీ+12జీబీ వేరియంట్ ధర రూ.24,999గా నిర్ణయించారు. 8జీబీ+ 256జీబీ వేరియంట్ ధర రూ.26,999గానూ, 12జీబీ+ 256జీబీ వేరియంట్ ధరను రూ.28,999గానూ నిర్ణయించారు. బ్లాక్ ఇన్ఫినిటీ, మార్బుల్ మిస్ట్, నెక్సస్ బ్లూ రంగుల్లో లభిస్తుంది. సీఈ 5 జులై 12 నుంచి సేల్ కి రానుంది. పలు వెబ్ సైట్స్‌లో ఈ ఫోన్లు అవైలబుల్ గా ఉంటాయి.



# వైరల్ బ్యూటీ హ్యాక్ ను మీరు ట్రై చేశారా?

ఎక్కువగా నిద్ర పోయినా లేదా నిద్ర సరిగ్గా పట్టకపోయినా ఫేస్ ఉబ్బినట్టు అవుతుంది. ఇలా ఎంతోమందికి జరిగే ఉండొచ్చు. ఆ ముఖం మీద ఉన్న పఫ్ఫీనెస్ ను తగ్గించుకోవడానికి ఇప్పుడు ఒక బ్యూటీ హ్యాక్ వైరల్ గా మారింది. చెవులకి రబ్బర్ బ్యాండ్‌లు పెట్టుకోవడం ద్వారా ముఖంపై ఉన్న ఈ పఫీనెస్ ను తగ్గించుకోవచ్చని ఇన్ ఫ్లూయన్సర్లు చెబుతున్నారు. బాలీవుడ్ బ్యూటీ మలైకా అరోరా తన ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లో ఒక టిప్ ను షేర్ చేసుకుంది. తన ఫేస్ ఉబ్బినట్టుగా ఉందని, దాన్ని సరి చేసుకోవడానికి చెవులకు రబ్బర్ బ్యాండ్ లు పెట్టుకుంటున్నట్టు చెప్పింది. ఇప్పుడు ఇన్ స్టాగ్రామ్, టిక్ టాక్‌లో ఈ బ్యూటీ హ్యాక్ ఎంతో వైరల్‌గా మారింది. అయితే ఇలా చెవులకు రబ్బర్ బ్యాండ్ పెట్టుకోవడం ద్వారా ముఖాన్ని అందంగా మార్చుకోవచ్చా? పఫీనెస్‌ను తగ్గించుకోవచ్చా? నిజంగా ఇది వర్క్ అవుతుందా లేదా అనేది ఇప్పుడు డీటైల్డ్ గా తెలుసుకుందాం. చెవులకు రెండు రబ్బర్ బ్యాండ్లను పెట్టడం వల్ల చెవులలోని కొన్ని కీ పాయింట్లుపై తేలికపాటిగా ఒత్తిడి పెరుగుతుంది. ఇది ముఖంలో వచ్చిన ఛేంజెస్ పై ఎఫెక్ట్ చూపిస్తుంది. ముఖంలో చేరిన ఎడిషనల్ లిక్విడ్ ను బయటకు పంపేందుకు ఇది ఉపయోగపడుతుంది. ముఖంపై ఉన్న ఈ అదనపు లిక్విడ్ బయటికి పోతే ముఖం పైన ఉన్న ఉబ్బుతనం తగ్గిపోతుంది. అప్పుడు ముఖం అందంగా అనిపిస్తుంది. చెవులకు రబ్బర్ బ్యాండ్‌లు పెట్టిన తర్వాత అక్కడ చర్మం కాస్త బిగుతుగా, ఎర్రగా మారడం గమనిస్తారు. ఆ ప్లేస్ లో రక్తప్రసరణ తగ్గి కాస్త చికాకుగా అనిపిస్తుంది. అయితే ఇది పూర్తిగా టెంపరరీ. కొన్ని నిమిషాలలో ఆ రబ్బర్ బ్యాండ్లను తీసేయవచ్చు. ఈ బ్యూటీ హ్యాక్ వల్ల జరిగే ప్రమాదం ఏమీ లేదు. కాకపోతే చెవులు చుట్టూ బిగుతుగా, రబ్బర్ బ్యాండ్ పెట్టడం వల్ల చికాకుగా అనిపిస్తుంది. ఎర్రగా మారుతుంది అక్కడ బ్లడ్ సర్కులేషన్ కు బ్రేక్ పడుతుంది. ఒకవేళ ఇలా చేయడం మీకు రిస్క్ అనిపిస్తే.. ముఖం మీద ఉన్న పఫ్ఫీనెస్‌ను తగ్గించుకోవడానికి కొన్ని రకాల టిప్స్ ని ఫాలో అవ్వచ్చు.. అవేంటంటే.. ముఖానికి ఐస్ క్యూబ్స్ రాయడం వల్ల కొంతవరకు ముఖంపై ఉబ్బుతనం తగ్గుతుంది. అలాగే ఎక్కువ నీటిని తాగడం ద్వారా కూడా ఈ సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉంది ముఖ్యంగా ఉప్పును ఆహారంలో తగ్గిస్తే ముఖం ఉబ్బడం వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. అలాగే లింఫాటిక్ డ్రైనేజ్ మసాజ్ చేయడం కూడా మంచిది. అలాగే రాత్రిపూట కంటి నిండా నిద్రపోవాలి. ముఖ్యంగా తలను కొంచెం ఎత్తుగా ఉండేలా తలగడను పెట్టుకోవడం మంచిది. మలైకా అరోరా పాటించిన రబ్బర్ బ్యాండ్ బ్యూటీ చిట్కా ను మీకు ఫాలో అవ్వాలి అనిపిస్తే... రెండు చెవులకు రెండు రబ్బర్ బ్యాండ్లను పెట్టుకొని ఐదు నిమిషాలు పాటు ఉండండి. ఐదు నిమిషాల్లో మీరు ఏ పనులు చేసుకున్నా సమస్య లేదు. ఆ తర్వాత తీసేయండి. ఇంకా ఈ సిట్యూవేషన్ సీరియస్ గా ఉందనిపిస్తే.. ఫ్యామిలీ డాక్టర్ ను కన్సల్ట్ చేయండి.



# ప్రెగ్నెంట్స్ నిజంగానే అధికంగా ఫుడ్ తినాలా ?

**డాక్టర్స్ సలహా..**

ప్రెగ్నెన్సీ టైమ్‌లో లేడీస్ ఎంత జాగ్రత్తగా ఉంటే పుట్టే బిడ్డ అంత ఆరోగ్యంగా ఉంటారు. చాలామంది తెలిసి తెలియక కొన్ని తినకూడనివి ఎక్కువగా తింటారు. దానివల్ల వారి ఆరోగ్యం కూడా పాడవుతుంది. డెలివరీ తర్వాత కోలుకోవడానికి చాలా టైమ్ పడుతుంది. ప్రెగ్నెన్సీ సమయంలో చేయకూడని నాలుగు తప్పులేంటో ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే.. చాలా మంది ప్రెగ్నెంట్ గా ఉన్న వాళ్లకి.. ఇంట్లో వాళ్లు ఎప్పుడూ ఏదో ఒకటి పెడుతూనే ఉంటారు. వాళ్లు తింటూనే ఉంటారు. మీరు వద్దన్నా.. వాళ్లు కామన్‌గా చెప్పే మాట ఇదే.. ఇపుడు నువ్వు ఇద్దరికి సరిపోయే ఆహారం తినాలి అని. పోషకాల విషయంలో అది నిజమే కానీ, ఆహారం ఎక్కువగా తీసుకోవడం మాత్రం అవసరం లేదు. ఎక్కువ ఫుడ్ తినడం వల్ల బరువు ఎక్కువగా పెరుగుతారు. దానివల్ల షుగర్, హై బ్లడ్ ప్రెజర్ లాంటి సమస్యలు రావచ్చు. అమెరికన్ కౌన్సిల్ ఆఫ్ గైనకాలజిస్ట్ ప్రకారం.. ప్రెగ్నెన్సీ ఫస్ట్ ట్రైమిస్టర్ లో మన శరీరానికి మామూలు సమయం కన్నా ఎక్కువ కేలరీలు అవసరం లేదు. మహిళలు రెగ్యులర్ గా తీసుకునే ఆహారం సరిపోతుంది. అలాగే వాంతులు, తల తిరగడం వంటి సమస్యల వల్ల సరిగ్గా ఆహారం తీసుకోకపోయినా వారు తీసుకునే కొద్దిపాటి ఆహారం బేబి ఎదుగుదలకు సరిపోతుంది. సెకండ్ ట్రైమిస్టర్ లో మాత్రం రోజుకు 300 కేలరీలు అవసరమవుతాయి. దానికోసం కూడా రోజుకు ఒకసారి అదనంగా ఒక స్నాక్ తినడం లేదా ఒక కప్పు పెరుగు లేదా యోగర్ట్, ఆహారంలో చికెన్ చేర్చుకుంటే చాలు. ఇక థర్డ్ ట్రైమిస్టర్ లో 300 500 kcal రోజుకు అవసరం. ఆకలి కూడా ఎక్కువగా అనిపిస్తుంది కాబట్టి రోజూవారీ ఆహారంలో మరొక అదనపు స్నాక్ ఏదైనా చేర్చుకుంటే చాలు. ఎంత తింటున్నామన్నది కాదు, ఏం తింటున్నామో ముఖ్యం. బరువు పెరుగుతామనే భయం లేకుండా పోషకాలున్న ఆహారం తీసుకోవాలి. ఎక్కువ పంచదార ఉన్న డ్రింకులు, ప్యాక్ చేసి నిల్వ చేసిన చిరుతిండ్ల జోలికి పోకూడదు. దానికి బదులు చిరుధాన్యాలు, ఇంట్లో చేసిన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వైద్యుల సలహాతో వ్యాయామం చేయడం చాలా మంచిది. అలాగే వ్యాయామం చేసేటపుడు ఖాళీ కడుపుతో కన్నా కనీసం అరగంట ముందు ప్రొటీన్, కార్బోహైడ్రేట్లున్న స్నాక్స్ తీసుకోవాలి. యోగర్ట్‌లో యాపిల్ ముక్కలు, అరటిపండ్లు పీనట్ బటర్ కలిపి తీసుకున్నా మంచిదే. ఉదయం లేవగానే వాంతులు, తల తిరగడం లాంటి సమస్యలుండొచ్చు. వాటివల్ల ఒత్తిడి తీసుకోకండి. కొన్నిసార్లు కొన్నింటి వాసనలు నచ్చక పోషకాలున్నా వాటిని పక్కన పెట్టేస్తారు. ఎలాంటి పోషకాలు లేని ఆహారం నోటికి రుచికి ఉందని ఎక్కువగా తినేస్తారు. ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి. దానికి బదులుగా సమస్య కాస్త నియంత్రణలో ఉంచుకునే ప్రయత్నం చేయాలి. వాసనలు పడకపోతే ఉడికించిన కూరగాయలు, పాస్తా, చికెన్, చేపలు ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇంకా మీకు ఎడిషనల్ గా తీసుకోవాలంటే సీజనల్ ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్స్ తీసుకుంటే సరిపోతుంది. ఏదైనా అతి అనేది మంచిది కాదు. అలాగే అస్సలు ఫుడ్ తీసుకోకుండా ఉండటం కూడా మంచిది కాదు. కాబట్టి ఫుడ్ ను బ్యాలెన్స్ చేసుకుంటూ ఉండాలి.




# అర్ష్ దీప్ ఎంట్రీ.. స్పెషలిస్ట్ బ్యాటర్లు?

ఎడ్జ్ బాస్టన్ లో మ్యాచ్ గెలిచి హుషారుగా ఉన్న టీమిండియా ఇంగ్లాండ్ తో మూడో టెస్టుకు రెడీ అవుతున్నారు. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానం వేదికగా జులై 10న ప్రారంభం కానున్న మ్యాచ్ లో సక్సెస్ కోసం ఇరు జట్లూ తమ ప్లానింగ్స్ కు మెరుగు పెడుతున్నారు. ఎడ్జ్ బాస్టన్ లో ఓడినంత మాత్రాన ఇంగ్లాండ్ ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రత్యర్థి జట్టు మ్యాచ్ ను హ్యాండిల్ చేసుకుంది. భారత జట్టు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తేనే ఆతిథ్య జట్టుపై మరోసారి పైచేయి సాధించగలదు. అయితే, ఇప్పుడు చర్చంతా భారత్ ఫైనల్ టీమ్ గురించే జరుగుతోంది. లార్డ్స్ మైదానం పేస్ బౌలింగ్ కు అనుకూలిస్తుందనేది అందరికీ తెలిసిన విషయం. కాబట్టి, నలుగురు సీమర్లు, ఒక స్పిన్నర్‌తో భారత్ బరిలోకి దిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు కనబడుతోంది. గత అనుభవాల దృష్ట్యా గంభీర్ గిల్ దీనికే ఓటేసే అవకాశం ఉంది. ఎందుకంటే ఇక్కడ టీమిండియా ఆడిన గత మూడు టెస్టుల్లో రెండిట్లో గెలిచింది. అప్పుడు 4+1 కాంబినేషన్‌తో దిగారు. 2018లో ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగిన భారత్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. దీంతో టీమిండియా మరోసారి ఇద్దరు స్పిన్నర్లను ఆడించే సాహసం చేయకపోవచ్చు. ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, నలుగురు పూర్తిస్థాయి పేసర్లు, ఒక స్పిన్ ఆల్ రౌండర్ తో భారత్ ఫైనల్ టీమ్ లో కొన్ని మార్పులు ఉండే అవకాశముంది. ఈ లెక్కన పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డికి ఛాన్స్ దక్కడం అనుమానమే. గత మ్యాచ్ కు విశ్రాంతి తీసుకున్న జస్ ప్రీత్ బుమ్రా ఈ ఫైనల్ టీమ్ లోకి రావడం ఖాయం. తొలి రెండు టెస్టుల్లో పెద్దగా రాణించలేకపోయిన ప్రసిద్ధ్ కృష్ణపై వేటు వేసి అర్ష్‌దీప్ సింగ్ కు అవకాశం ఇవ్వొచ్చు. ఇక, రెండో టెస్టులో అదరగొట్టిన సిరాజ్, ఆకాశ్ దీప్‌లను పక్కనపెట్టే పరిస్థితి లేదు. ఇంగ్లాండ్‌లో ఆడిన అనుభవం ఉన్న ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు మరోసారి ఛాన్స్ దక్కడం పక్కా అనిపిస్తుంది. ఇక బ్యాటింగ్ విషయానికొస్తే.. ఆరుగురు స్పెషలిస్టు బ్యాటర్లతో బరిలోకి దిగితే యువ ఆటగాళ్లు అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్‌లో ఒకరు ఈ మ్యాచ్‌లో ఆడటం ఖాయం. అదే జరిగితే కరుణ్ నాయర్ మళ్లీ ఆరో స్థానంలోకి రావొచ్చు. ఎప్పటిలాగే జైస్వాల్, రాహుల్ ఓపెనింగ్ చేయనున్నారు. నాలుగో స్థానంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, తర్వాత రిషభ్ పంత్ వస్తారు. ఒకవేళ నితీశ్‌ను పక్కన పెట్టకూడదు అనుకుంటే.. సుదర్శన్ మరోసారి పెవిలియన్‌కి పరిమితవుతాడు. భారత్ ఫైనల్ టీమ్ అంచనాలు ఎలా ఉన్నాయంటే.. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, ఆకాశ్ దీప్, మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ లు టీమ్ లోకి తీసుకునేలా కనిపిస్తుంది.



# భారత మహిళల క్రికెట్.. ఐసీసీ ర్యాంకింగ్స్

భారత మహిళల జట్టు ఆల్ రౌండర్ దీప్తి శర్మ ఐసీసీ ర్యాంకింగ్స్ లో తన సత్తా చాటుకుంది. ఇంగ్లాండ్ పర్యటనలో తిప్పేస్తున్న ఆమె టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్ లో కూడా తన ప్రతిభను నిరూపించుకుంది. ఈ క్రమంలో సెకండ్ ప్లేస్ లో దూసుకుపోతుంది. గత ఆరేళ్లుగా టాప్ 10లో ఉంటున్న దీప్తి.. ఒక ర్యాంక్ ను క్రాస్ చేసిన ఇప్పుడు టాప్ 2గా నిలిచింది. అగ్రస్థానంలో ఉన్న పాకిస్థాన్ సదియా ఇక్బాల్ కు, దీప్తికి 8 పాయింట్ల తేడానే ఉంది. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ఆల్ రౌండర్ కు కెరీర్ లోనే ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం హైలెట్ గా నిలుస్తుంది. అంతేకాకుండా పేసర్ రేణుకా సింగ్ 6లో, రాధా యాదవ్ 18లో, తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి 11 స్థానాలు మెరుగుపరచుకొని 43వ ర్యాంక్ లో కంటిన్యూ అవుతున్నారు. గత కొంత కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌లో దీప్తి నిలకడగా రాణిస్తోంది. ఈమధ్యే ట్రయాంగిల్ వన్డే సిరీస్ గెలుపొందడంలో కీలక పాత్ర ఆమెదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. అనంతరం ఇంగ్లండ్ పర్యటనలో కూడా దీప్తి బ్యాటుతో, బంతితో చెలరేగిపోతోంది. మూడో టీ20లో మూడు వికెట్లు తీసిన భారత స్టార్ టీ20ల్లో తన ర్యాంక్‌ను మెరుగుపరచుకుంది. ఇంగ్లండ్ బౌలర్లలో ఇసీ వాంగ్ 57వ, లారెన్ ఫిలర్ 68వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టాప్ 5లో చోటు దక్కించుకుంది. ఇంగ్లండ్ గడ్డపై పరుగుల వరద పారిస్తున్న మంధాన మూడో ర్యాంక్ కైవసం చేసుకుంది. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 12వ స్థానంలో ఉండగా ఈమధ్యే రీఎంట్రీ చేసిన షఫాలీ వర్మ 13, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 వ స్థానంలో ఉన్నారు. దీంతో వీరి ర్యాంకింగ్స్ పై వారి ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే గతేడాది కన్నా ఈ సారి వారి టాలెంట్ ను ప్రూవ్ చేసుకోవడమే కాకుండా ఆటలోనూ తమ దైన శైలిలో రాణించారు.

# క్రికెట్ కన్నా.. వింబుల్డన్ లోనే ఒత్తిడి: విరాట్

లండన్ లోని సెంటర్ కోర్టులో జకోవిచ్, అలెక్స్ డి మినార్ మధ్య రీసెంట్ గా వింబుల్డన్ మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ ను విరాట్ కోహ్లీ తన వైఫ్ అనుష్క శర్మతో కలిసి చూశారు. ఈ మ్యాచ్ తర్వాత ఆయన ఓ స్పోర్ట్స్ ఛానల్‌తో మాట్లాడాడు. క్రికెట్ కన్నా.. వింబుల్డన్‌లోనే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వరల్డ్ కప్ లో టీమిండియా, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ లు ఉన్నప్పుడు ఎంత తీవ్రమైన ఒత్తిడి ఉంటుందో, ప్రతి వింబుల్డన్ మ్యాచులోనూ అంతే స్థాయిలో ఉంటుందని వివరించాడు. ఆడియన్స్ తో కిక్కిరిసిన క్రికెట్ మైదానంలో ఆడటం కంటే.. సెంట్రల్ కోర్టులో వింబుల్డన్ ఆడటమే కాస్త కష్టమన్నాడు. రీసెంట్ గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ ఫస్ట్ ఐపీఎల్ టైటిల్ ను గెలుచుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయోత్సవం సందర్భంగా బెంగళూరులో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 11 మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన తర్వాత కోహ్లీ మళ్లీ ఇప్పుడే బయట కనిపించాడు. క్రికెట్ లో అభిమానులు ఆటగాళ్లకు దూరంగా ఉంటారు. కేవలం బౌండరీ దగ్గర ఫీల్డింగ్ చేసేవాళ్లే ప్రేక్షకులకు కాస్త దగ్గరగా ఉంటారు. కానీ వింబుల్డన్ లో అలా కాదు. జనాలు మనకు చాలా దగ్గరగా ఉంటారు. ఇది ఒత్తిడిని పెంచుతుంది. ఈ కారణంగానే నాకు టెన్నిస్ ఆటగాళ్లంటే అపారమైన గౌరవం ఉంది. వీళ్లు శారీరకంగా, మానసికంగా తమ ఫిట్‌నెస్ ను కాపాడుకోవడం నిజంగా గ్రేట్. వరల్డ్ కప్ లో ఇండియా, పాకిస్థాన్ మ్యాచుల్లో మాత్రమే కాళ్లు వణికేంత ఒత్తిడి ఉంటుంది. కానీ టెన్నిస్ ఆటగాళ్లు క్వార్టర్ ఫైనల్ నుంచి ఫైనల్ వరకు ఇదే రకమైన ఒత్తిడిని ఎదుర్కొంటారు అని విరాట్ కోహ్లీ అన్నాడు.






# సౌతాఫ్రికా కెప్టెన్ సెన్సేషనల్ కామెంట్స్

క్రికెట్ టెస్టుల్లో ఆడాలనేది చాలా మంది క్రికెటర్ల డ్రీమ్ గా ఉంటుంది. ఒకవేళ అరంగేట్ర అవకాశం వస్తే అదరగొట్టాలని చూస్తారు. బ్యాటర్లైతే సెంచరీలతో చెలరేగాలని చూస్తారు. డబుల్ సెంచరీ కొడితే వారి ఆనందానికి హద్దులుండవు. ట్రిపుల్ సెంచరీ మార్క్‌ను అందుకుంటే కెరీర్ కంప్లీట్ అయినట్లు భావిస్తారు. ఇక క్వాట్రపుల్ సెంచరీ చేస్తే ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతారు. అయితే సుదీర్ఘ ఫార్మాట్‌లో కేవలం వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా మాత్రమే ఈ ఫీట్ సాధించాడు. ఎంతో మంది స్టార్ బ్యాటర్లు దీన్ని తిరగరాయాలని అనుకున్నా దరిదాపుల్లోకి కూడా రాలేకపోయారు. అయితే సౌతాఫ్రికా సారథి వియాన్ ముల్డర్ మాత్రం 400 కొట్టే అవకాశం ఉన్నా వద్దనుకున్నాడు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇది చాలా స్పెషల్ ఇన్నింగ్స్. నిజం చెప్పాలంటే నేను డబుల్ సెంచరీ కొడతానని కూడా ఎప్పుడూ అనుకోలేదు. నాకు అలాంటి డ్రీమ్స్ కూడా లేవు. అలాంటిది ఏకంగా ట్రిపుల్ సెంచరీ బాదడం చాలా సంతోషంగా ఉంది. ఈ నాక్ ద్వారా నా జట్టుకు చాలా ప్రయోజనం చేకూరింది. మ్యాచ్‌ను గెలిచే స్థితికి చేరుకున్నాం. సౌతాఫ్రికా ఆడటం మొదలుపెట్టిన కొత్తలో ఈ స్థాయిలో రాణిస్తానని అనుకోలేదు. అయితే సీనియర్ల నుంచి చాలా విషయాలు నేర్చుకొని నన్ను నేను ఎంతో మలచుకున్నా. దిగ్గజం బ్రియాన్ లారా కోసమే నేను 400 వద్దనుకున్నా. ఆయన రికార్డు చాలా ప్రత్యేకం. అది ఎప్పటికీ అలాగే ఉండిపోవాలి. అందుకే నేను ఇన్నింగ్స్ డిక్లేర్ చేసేశా అని ముల్డర్ రివీల్ చేశాడు. కోచ్ షుక్రీ కోన్రాడ్ తో మాట్లాడానని.. ఆ తర్వాతే 400 వద్దనుకున్నానని ముల్డర్ బయటపెట్టాడు. లారా పేరు మీదే ఆ రికార్డు ఉండాలని, అదే సరైనదని తాను భావించానని తెలిపాడు. కాగా, జింబాబ్వేతో మ్యాచ్‌లో 367 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేశాడు ముల్డర్. 400 కొట్టే చాన్స్ ఉన్నా లారా రికార్డును టచ్ చేయొద్దనే ఉద్దేశంతో వెనక్కి తగ్గాడు. దీంతో అతడిపై క్రికెట్ ప్రపంచం ప్రశంసల వర్షం కురిపిస్తోంది. దిగ్గజాలకు గౌరవం ఇచ్చే ఇలాంటి క్రికెటర్లు చాలా అరుదని.. నువ్వు మా మనసులు గెలిచావ్ అంటూ సౌతాఫ్రికా సారథిని మెచ్చుకుంటున్నారు. కాగా, ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 625 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది ప్రొటీస్. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 170 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఫాలో ఆన్‌కు దిగిన ఆ జట్టు రెండో రోజు ఆట ముగిసేసరికి వికెట్ నష్టానికి 51 పరుగులతో ఉంది. ఇక ఈ టెస్ట్ క్రికెట్ లో మిగతా ప్లేయర్స్ కూడా తమదైన శైలిలో ఆటను ముందుకు తీసుకెళ్లారు. ఇక ముల్డర్ విషయానికి వస్తే.. ఆయన కెరీర్ లో ఈ టెస్ట్ మ్యాచ్ మెమరబుల్ గా ఉంటుందని అన్నారు.

# ఆర్సీబీ బ్రాండ్ వాల్యూ ఎంతో తెలుసా?

దాదాపు 18 ఏళ్ల తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ ట్రోఫీని సొంతం చేసుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూర్ బ్రాండ్ వాల్యూ అమాంతం పెరిగిపోయింది. ఐపీఎల్ 2025 సీజన్ లో విన్నర్ గా నిలిచి తమ చిరకాల కోరికను నిజం చేసుకుంది. ఫైనల్ ఫైట్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి చాంపియన్‌గా అవతరించింది. ఇలా చరిత్ర సృష్టించిన ఆర్సీబీ ఇప్పుడు మరో అరుదైన ఘనతను అందుకుంది. క్యాష్ రిచ్ లీగ్‌లో మోస్ట్ వాల్యుబుల్ టీమ్‌గా రికార్డు సృష్టించింది బెంగళూరు. ఈ లిస్ట్ లో టాప్ పొజిషనల్ లో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ ను కోహ్లీ టీమ్ క్రాస్ చేసేసింది. ఐపీఎల్ లో మోస్ట్ వాల్యుబుల్ టీమ్ గా ఆర్సీబీ నిలిచింది. ఆ జట్టు విలువ రూ.2,256 కోట్లకు చేరుకుంది. గతేడాదితో పోలిస్తే ఆ టీమ్ బ్రాండ్ వాల్యూ 18.5 శాతం పెరగడం హైలెట్ అవుతుంది. అత్యధిక విలువ కలిగిన టీమ్స్ లిస్ట్ లో సెకండ్ ప్లేస్ లో ముంబై ఇండియన్స్. గత సంవత్సరంతో పోలిస్తే ఈ జట్టు విలువ 18.6 శాతం పెరిగింది. ఇంతకుముందు వరకు టాప్‌లో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ మూడో స్థానానికి పడిపోయింది. గతేడాదితో పోలిస్తే ఆ జట్టు బ్రాండ్ వాల్యూ కేవలం 1.7 శాతం మాత్రమే పెరిగింది. బ్రాండ్ వాల్యూ లిస్ట్ లో చెన్నై సూపర్ కింగ్స్ తర్వాతి స్థానాల్లో కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ నిలిచాయి. పంజాబ్ జట్టు అందరి కంటే ఎక్కువగా తమ బ్రాండ్ వాల్యూను పెంచుకుంది. గతేడాదితో పోలిస్తే ఆ టీమ్ విలువ ఈసారి 39.6 శాతం పెరగడం విశేషం. ఇక, ఐపీఎల్ టోర్నీ బ్రాండ్ వాల్యూ 13.8 శాతం పెరిగి 3.9 బిలియన్లు అంటే ఇండియన్ కరెన్సీలో సుమారుగా రూ.32,721 కోట్లుకు చేరుకుంది.





## వేల కోట్లు కలెక్ట్ చేస్తున్న
# డైనోసార్లు

హాలీవుడ్ లో కొన్ని ఫ్రాంచైజీలకు క్రేజ్ చాలా ఎక్కువ. స్పైడర్ మ్యాన్, అవెంజర్స్, ఐరన్ మ్యాన్, మమ్మీ లాంటివి ఎగ్జాంపుల్స్ గా చెప్పుకోవచ్చు. వీటికి ఎన్ని సీక్వెన్స్ లు వచ్చినా సరే జనాలు చాలా ఇంట్రెస్టింగ్ గా చూస్తారు. అలాని ప్రతి పార్ట్ లో కొత్త కథేమీ ఉండదు. జస్ట్ ముందు వచ్చిన వాటికి కొన్ని మార్పులు చేసి, యాక్షన్ ఎపిసోడ్లు భారీగా పెట్టి రిలీజ్ చేస్తారు. అదనంగా 3డి, ఐమాక్స్, ఐస్ అంటూ ప్రత్యేకంగా వెర్షన్లు రిలీజ్ చేయడం ద్వారా ఎక్కువ శాతం ఆడియన్స్ ని ఆకట్టుకుంటారు. ప్రస్తుతం జురాసిక్ వరల్డ్ రీ బర్త్ ఇదే పనిలో ఉంది. ఇండియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా మొన్న జూలై 4 రిలీజైన సంగతి తెలిసిందే. నాలుగు రోజులకు గాను ఇండియాలో సుమారు 45 కోట్ల దాకా వసూలు చేసినట్టు ట్రేడ్ రిపోర్ట్. నిజానికి ఇది చాలా పెద్ద మొత్తం. నిన్న సోమవారం వర్కింగ్ డే అయినా కూడా వేరే ఏ సినిమాకు సాధ్యం కాని రీతిలో డీసెంట్ నెంబర్లు దీనికే రికార్డ్ అయ్యాయి. సండేతో పోలిస్తే డెబ్భై శాతం దాకా డ్రాప్ ఉన్నప్పటికీ అనుకున్న దానికన్నా జురాసిక్ వరల్డ్ రీ బర్త్ ఎక్కువ పే చేస్తోంది. మొదటి మూడు రోజులు హంగామా చేసిన కన్నప్ప, రీసెంట్ గా రిలీజ్ అయిన తమ్ముడు కూడా రాకాసి బల్లుల కన్నా చాలా తక్కువ వసూలు చేయడం గమనార్హం. బ్రాడ్ పిట్ ఎఫ్1 కన్నా జురాసిక్ రీ బర్త్ కే ఎక్కువ ఆదరణ దక్కుతున్న వైనం సౌత్ స్టేట్స్ లో ఎక్కువగా కనిపిస్తోంది. నిజానికి జురాసిక్ వరల్డ్ రీ బర్త్ మీద పెద్దగా పాజిటివ్ రివ్యూలు రాలేదు. చూసిందే మళ్ళీ చూపించారనే కామెంట్స్ ఎక్కువగా వచ్చాయి. అయినా ఆడియన్స్ ఒక్కసారి చూడాలని డిసైడైపోయారు. ఫలితంగా ఈ సినిమా వరల్డ్ వైడ్ ఇప్పటిదాకా 322 మిలియన్ డాలర్లు వసూలు చేసిందట. అంటే మన కరెన్సీ లో 2765 కోట్లు. అందరూ ఆహా ఓహో అని మెచ్చుకున్నా ఎఫ్1 వసూలు చేసింది కేవలం 293 మిలియన్ డాలర్లు అంటే 2515 కోట్లు. దీన్ని బట్టే రాకాసి బల్లులు జనాన్ని ఎంతగా థియేటర్లకు రప్పించాయో అర్థం చేసుకోవచ్చు. ఈ వారం సూపర్ మ్యాన్ వస్తున్నాడు కాబట్టి డైనోసార్ల దూకుడుకు బ్రేక్ పడే ఛాన్స్ ఉంది.





## NBK111 కోసం
# ఇద్దరు స్టార్స్

నందమూరి బాలకృష్ణ ప్రజంట్ ఫుల్ జోష్ లో ఉన్నారు. వరుస సక్సెస్ లతో కెరీర్లో దూసుకెళ్తున్న బాలకృష్ణ, బోయపాటి శ్రీను దర్శకత్వంలో అఖండ సినిమాకు సీక్వెల్ గా అఖండ2 చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ చాలా స్పీడ్ గా జరుగుతుంది. సెప్టెంబర్ 25న ఈ సినిమా రిలీజ్ కానున్న నేపథ్యంలో షూటింగ్ను వేగంగా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అఖండ2 తర్వాత బాలయ్య, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఆల్రెడీ వీరిద్దరూ కలిసి గతంలో వీరసింహా రెడ్డి సినిమా చేశారు. ఆ సినిమా ఆడియన్స్ నుంచి మంచి టాక్ ను తెచ్చుకోవడంతో పాటూ బాక్సాఫీస్ వద్ద కూడా బాగా కలెక్ట్ చేసి ప్రొడ్యూసర్స్ కి మంచి కలెక్షన్స్ తెచ్చిపెట్టింది. వీర సింహా రెడ్డి సినిమా చేస్తున్న టైమ్ లోనే బాలయ్య, గోపీచంద్ తో మరో సినిమా కూడా చేస్తానని మాటిచ్చారు. ఆ మాట ప్రకారమే గోపీచంద్ తో ఇప్పుడు మరో సినిమా చేయబోతున్నారు బాలయ్య. ఇప్పటికే ఆ సినిమాకు సంబంధించిన అఫిషియల్ అనౌన్స్ మెంట్ కూడా వచ్చింది. బాలకృష్ణ కెరీర్లో 111వ సినిమాగా తెరకెక్కనున్న ఆ మూవీ గురించి రీసెంట్ గా నాట్స్ లో గోపీచంద్ మాట్లాడుతూ ఈ సినిమాలో బాలయ్యను మునుపెన్నడూ చూడని కొత్త యాంగిల్ లో చూపిస్తానని చెప్పి సినిమాపై అంచనాలను పెంచిన సంగతి తెలిసిందే. ఆల్రెడీ మంచి హైప్ తో తెరకెక్కబోయే ఈ సినిమా గురించి ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ వినిపిస్తోంది. ఈ సినిమాలో కీ రోల్స్ లో యాక్ట్ చేయడానికి డైరెక్టర్ గోపీచంద్ మలినేని ఇద్దరు స్టార్ యాక్టర్స్ తో డిస్కషన్స్ చేస్తున్నారని తెలుస్తోంది. అయితే ఆ నటులెవరనేది తెలియదు కానీ ఈ వార్త మాత్రం సినిమాపై ఉన్న అంచనాలను డబుల్ చేస్తోంది. దీన్ని బట్టి చూస్తుంటే గోపీచంద్ ఈసారి వీర సింహారెడ్డిని మించిన సినిమాను బాలయ్యతో ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

## RC 17
# స్క్రిప్ట్ లాక్?

ఆర్ఆర్ఆర్ తర్వాత రామ్ చరణ్ క్రేజ్ తో పాటు, మార్కెట్ కూడా గ్లోబల్ రేంజ్ లో పెరిగిపోయాయి. ఎంతో టైమ్ కేటాయించి, భారీ ఆశలతో స్టార్ డైరెక్టర్ శంకర్ తో గేమ్ ఛేంజర్ చేస్తే ఆ సినిమా దారుణంగా డిజాస్టర్ అయ్యింది. దీంతో ఇప్పుడు రామ్ చరణ్, అతని ఫ్యాన్స్ ప్రజంట్ బుచ్చిబాబు సాన డైరెక్షన్ లో చేస్తున్న పెద్ది సినిమాపైనే తమ హోప్స్ ను పెట్టుకున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ స్పోర్ట్స్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాపై అందరికీ మంచి ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. ప్రజంట్ పెద్ది షూటింగ్ స్పీడ్ గా జరుగుతుంది. జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తుండగా వచ్చే ఏడాది మార్చి 27న పెద్ది రిలీజ్ కానుంది. అక్టోబర్ నాటికి పెద్ది సినిమాను పూర్తి చేసి నెక్ట్స్ సినిమాను స్టార్ట్ చేయాలని చరణ్ చూస్తున్నారట. పెద్ది మూవీ చరణ్ కెరీర్ లో 16వ సినిమాగా వస్తుంది. దీని తర్వాత చరణ్ తన 17వ సినిమాను డైరెక్టర్ సుకుమార్ తో చేయనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబోలో ఇప్పుడు సినిమా లాక్ అయినట్టు తెలుస్తోంది. దీని కోసం సుకుమార్ ఆల్మోస్ట్ స్క్రిప్ట్ ను పూర్తి చేశారని, అన్నీ చూసుకుని మంచి టైమ్ లో సినిమాను అనౌన్స్ చేయనున్నారని అంటున్నారు. కాగా ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్ లో రంగస్థలం సినిమా వచ్చిన






విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వం లో చరణ్ చేసిన రంగస్థలం సినిమా అప్పట్లో ఇండస్ట్రీ హిట్ గా నిలవడంతో పాటూ ఆ సినిమాతో డైరెక్టర్ గా సుకుమార్ కు, హీరోగా రామ్ చరణ్ కు చాలా మంచి ప్రశంసలు కూడా వచ్చాయి. ఈసారి చరణ్ తో సుకుమార్ చేయబోయే సినిమా రంగస్థలాన్ని మించి ఉంటుందనేది టాక్.



## ప్రభాస్ కోసం మిల్కీ బ్యూటీ
# ప్రిపరేషన్?

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ సినిమా ది రాజాసాబ్.. ఇప్పటికే ఎలాంటి అంచనాలు క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు మారుతి డైరెక్ట్ చేస్తుండగా ఈ సినిమాని హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై అంచనాలు రెట్టింపు చేశాయి. అయితే, ఈ సినిమా నుంచి ఇప్పుడొక ఇంట్రెస్టింగ్ వార్త సినీ సర్కిల్‌స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉండనుందని.. దీని కోసం పలువురు హీరోయిన్ల పేర్లు ఫిల్మ్ యూనిట్ పరిశీలిస్తున్న సంగతి తెలిసిందే. కాగా, ఇప్పుడు ఈ సాంగ్ కోసం మిల్కీ బ్యూటీ తమన్నాను ఓకే చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బాలీవుడ్‌లో స్పెషల్ సాంగ్ అంటే వెంటనే అందరికీ గుర్తుకు వచ్చే పేరు తమన్నా. అంతలా అమ్మడు అక్కడి స్పెషల్ సాంగ్‌స్‌తో క్రేజ్ తెచ్చుకుంది. ఇక తెలుగువారికి ఎంతో పరిచయం ఉన్న తమన్నా, ఇప్పుడు రాజా సాబ్ సినిమా స్పెషల్ సాంగ్‌లో వస్తుందనే వార్తతో మరోసారి ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇక గతంలో ప్రభాస్, తమన్నా రెబల్, బాహుబలి 1, బాహుబలి 2 వంటి సినిమాలో కలిసి నటించారు. మరి నిజంగానే తమన్నా రాజాసాబ్ కోసం స్పెషల్ ఎంట్రీ ఇస్తుందేమో చూడాలి.






## రణ్ వీర్ ను విష్ చేయని దీపిక..
# ఎందుకంటే?

రణ్‌వీర్ సింగ్ వయసు ఇప్పుడు అక్షరాలా 40. ఈసారి బర్త్ డేకి అతడు నటించిన కొత్త సినిమా టీజర్ రిలీజ్ అయ్యింది. రణ్ వీర్ లేటెస్ట్ సినిమా ధురంధర్. పాథ్ బ్రేకింగ్ మూవీగా అతడి కెరీర్ లో ప్రత్యేకంగా నిలిచిపోనుందని చాలా చర్చ సాగుతోంది. ధురంధర్ టీజర్ ను రణవీర్ పుట్టినరోజు స్పెషల్ గా విడుదలై సంచలనం సృష్టించింది. సోషల్ మీడియాలో ఇది ఫుల్ ట్రెండింగ్ లో దూసుకుపోతోంది. ధురంధర్ టీజర్ లో రణ్ వీర్ యాక్టింగ్ అండ్ కాస్టుమ్స్, లుక్స్ తో పాటు కంటెంట్ కూడా చాలా సర్ ప్రైజ్ చేస్తుంది. దర్శకుడు ఆదిత్యాధర్ ఈసారి ఒక కొత్త జానర్ లో రణ్ వీర్ ని ప్రజంట్ చేస్తున్నాడని ప్రశంసలు కురుస్తున్నాయి. చాలా మంది బాలీవుడ్ ప్రముఖులు దాని గురించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి రణ్‌వీర్ కు విషెస్ తెలిపారు. అయితే ఎవరు ఎలా స్పందించినా కానీ, ఈ టీజర్ గురించి కానీ, రణ్ వీర్ గురించి కానీ దీపిక పదుకొనే ఎక్కడా మెన్షన్ చేయలేదు. కనీసం తన సోషల్ మీడియాల్లో టీజర్ ని షేర్ చేయలేదు. అలాగే రణ్ వీర్ కి పుట్టినరోజు విషెస్ కూడా చెప్పలేదు. దీనిపై నెటిజన్లు ఇప్పుడు రచ్చ రచ్చ చేస్తున్నారు. రణ్ వీర్ కి దీపిక కనీసం పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదు. ఈ సినిమా లుక్ గురించి ఎలాంటి పోస్ట్ చేయలేదు.. దీపిక గురించి రణ్వీర్ ప్రతిదీ ఓ రేంజ్ లో వైరల్ చేస్తూ ఎంటర్ టైన్ చేస్తారు. ఆమె తన భర్తను కొంచెమైనా అభినందించాల్సింది.. అంటూ ఒక నెటిజన్ పోస్ట్ ను షేర్ చేశారు. అయితే సోషల్ మీడియాలో అన్నిటినీ పోస్ట్ చేయరని చాలా మంది నెటిజనులు ఈ పోస్ట్ పై విరుచుకుపడ్డారు. మన జీవితాల్లో చాలా విషయాలను సోషల్ మీడియాల్లో పోస్ట్ చేయలేమని కూడా అన్నారు. దీపిక నటించిన ఫైటర్ మూవీ గురించి రణ్ వీర్ ఏదీ పోస్ట్ చేయలేదు.. అలాగని ఎమోషన్ లేదని అంటారా? అంటూ ఒక నెటిజన్ రాసాడు. సోషల్ మీడియాలపై అనవసరంగా ఎక్కువ దృష్టి పెట్టొద్దని కూడా కొందరు కామెంట్ చేశారు. ఇక ధురంధర్ ఫస్ట్ లుక్ ఇప్పటికే ప్రజల్లోకి దూసుకెళ్లింది. దీనికి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అందరూ రణ్‌వీర్ యాక్టింగ్ ఎనర్జీని ప్రశంసిస్తున్నారు. ఈ సినిమాలో సారా అర్జున్, సంజయ్ దత్, ఆర్ మాధవన్, అక్షయ్ ఖన్నా లాంటి గ్రేట్ యాక్టర్స్ నటిస్తున్నారు. విక్కీ కౌశల్ నటించిన యూరి: ది సర్జికల్ స్ట్రైక్ సినిమాకి దర్శకత్వం వహించిన ఆదిత్య ధర్ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. 5 డిసెంబర్ 2025న ఈ సినిమా విడుదల కానుంది.